
నేటి అలంకారం
కాత్యాయనీదేవి

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7




కృష్ణా
జిల్లా వార్తలు

గురువారం 25 సెప్టెంబరు 2025



పరమేశ్వరుడికే అన్నప్రసాదాన్ని భిక్షగా పెట్టిన అన్నపూర్ణాదేవి అలంకారంలో దుర్గమ్మ బుధవారం దర్శనమిచ్చారు. జగన్మాతను కరుణా, కటాక్షాల కోసం ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తారు. 19,159 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం దుర్గమ్మ నగరోత్సవం కనుల పండువగా సాగింది. అశేష జనవాహిని మేళతాళాలతో ముందుకు సాగింది. అంతటా ఆధ్యాత్మిక వెలుగులు విరజిమ్మాయి.



అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ



భక్తులకు అన్నం వడ్డిస్తున్న సేవకులు

మాతాన్నపూర్ణేశ్వరి

ఇంద్రకీలాద్రికి పోటెత్తుతున్న భక్తులు





నగరంలో విహరిస్తున్న దుర్గమ్మ.. హాజరైన భక్తజనం



ఆదిశక్తిగా నృత్య అభినాయం

అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మ దర్శనం

అన్నప్రసాదాన్ని స్వీకరించిన భక్తజనం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ఇంద్రకీలాద్రికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. కనకదుర్గమ్మ బుధవారం శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. రాత్రి ఏడు గంటల సమయానికి అమ్మవారిని 66,177 మంది దర్శించుకున్నారు. మొత్తం 19,159 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వినాయకుడి ఆలయం, కుమ్మరిపాలెం వైపు నుంచి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దర్శనం పూర్తికావడానికి గంట సమయం పట్టింది. తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు క్యూలు ఖాళీగా ఉన్నాయి. పది గంటల నుంచి ఒక్కసారిగా అన్ని క్యూలు కిటకిటలాడుతున్నాయి. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో అధికారులు మధ్యాహ్నం 3-5 గంటల వరకు వీఐపీ స్లాట్‌ను రద్దు చేశారు. ఉపరాష్ట్రపతి రాకతో 15-20 నిమిషాల పాటు భక్తులను దర్శనానికి అనుమతించలేదు. కాగా, కనకదుర్గమ్మ గురువారం శ్రీకాత్యాయని అలంకారంలో దర్శనమిస్తారు. కొన్నాళ్ల తర్వాత అమ్మవారిని ఈ అవతారంలో అలంకరిస్తున్నారు. 11 ఏళ్ల క్రితం కనకదుర్గమ్మ కాత్యాయని అమ్మవారి అలంకారంలో దర్శనమిచ్చారు. తిథులు హెచ్చుతగ్గులు రావడంతో ఈ ఏడాది శరన్నవరాత్రులను 11 రోజులపాటు నిర్వహించాలని వైదిక కమిటీ నిర్ణయించింది. సాధారణంగా శరన్నవరాత్రులు పది రోజులపాటు సాగుతాయి. ఈ ఏడాది 11 రోజులు శరన్నవరాత్రులు రావడంతో అమ్మవారికి శ్రీకాత్యాయని అలంకారం చేయనున్నారు. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి అమ్మవారు ఈ అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు.



భక్తులకు నమస్కరిస్తున్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ దంపతులు





అటవీ అధికారులు పరిశీలన జరిపిన జియో కో ఆర్డినేట్స్ మార్కింగ్ చేసిన ప్రాంతం



దుప్పి కళేబరం ఉన్న జియో కోఆర్డినేట్స్ మార్కింగ్ చేసిన ప్రాంతం

గూగుల్ కెమెరాతో అడ్డంగా బుక్కయ్యారు!

వన్యప్రాణుల వేట వ్యవహారంలో అటవీశాఖపై విమర్శలు

- కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో వన్యప్రాణులను వేటాడుతున్నారని ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం
- అవి ఇంటర్ నెట్ ఫొటోలంటూ అటవీశాఖ అధికారుల ఎదురుదాడి
- మంగళవారం ఉచ్చులో పడిన దుప్పి ఫొటోలు వెలుగులోకి రావడంతో డైలమాలో అధికారులు
- మళ్లీ కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌ను సందర్శించిన అటవీశాఖ అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో వన్య ప్రాణుల వేట అబద్ధమంటూ ఎదురుదాడి చేసిన అటవీశాఖ అధికారులు అడ్డంగా దొరికిపోయారు. వేటగాళ్ల ఉచ్చు పన్నటం లేదని, దుప్పులు వంటివి అస్సలు మృతి చెందిన దాఖలాలు లేవని తమకు తాము క్లీన్‌చిట్ ఇచ్చుకుంటూ 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన ఫొటోలు కొండపల్లి అటవీ ప్రాంతానివే కావని, వాటిని ఇంటర్ నెట్ నుంచి డౌన్‌లోడ్ చేశారంటూ తప్పించుకునేందుకు ప్రయత్నించి మిగతా 8లో..

విజయవాడకు ఉజ్వల భవిష్యత్తు

వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం ● ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

విజయవాడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో విజయవాడకు ఉజ్వల భవిష్యత్తు ఉందని ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ వ్యాఖ్యానించారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విజయవాడ ఒకటిగా ఉందన్నారు. కనకదుర్గమ్మను దర్శించుకున్న అనంతరం ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించానన్నారు. త్వరలో విజయవాడ అద్భుతంగా అభివృద్ధిని సాధిస్తుందని ఆకాంక్షించారు.

కృష్ణమ్మ పరుగులు!

ప్రకాశం బ్యారేజీ నుంచి 4.50 లక్షల క్యూసెక్కుల విడుదల

- పులిగడ్డ ఆక్విడెక్ట్‌ను తాకుతూ కడలివైపు ప్రవహిస్తున్న నీరు
- మరో రెండు రోజుల్లో 6.50 లక్షల నుంచి 7లక్షల క్యూసెక్కుల వరకు రానున్న వరద
- లంక గ్రామాల్లోని పంటలకు పొంచి ఉన్న ముప్పు
- 26, 27 తేదీల్లో కోస్తాకు భారీ వర్ష సూచనతో ఆందోళన



పులిగడ్డ ఆక్విడెక్ట్‌ను తాకుతూ ప్రవహిస్తున్న వరద

కడలి వైపు కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి కృష్ణానదికి వరద భారీగా రావడంతో ప్రకాశం బ్యారేజీ నుంచి 4.50 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. పులిగడ్డ ఆక్విడెక్ట్‌ను తాకుతూ రెండు రోజులుగా నీరు ప్రవహిస్తోంది. మరో రెండు రోజుల్లో 6.50 లక్షల నుంచి 7 లక్షల క్యూసెక్కుల వరకు వరద నీరు రానుండటంతో లంక గ్రామాల్లోని పంటలకు ముప్పు పొంచి ఉంది. 26, 27 తేదీల్లో భారీ వర్షాలు పడనున్నట్టు వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: ప్రకాశం బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రానికి సముద్రంలోకి 4.50 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ ఎగువన కృష్ణానదీ పరివాహక ప్రాంతం నుంచి వచ్చే వరదతో పాటు, భారీ వర్షాలు కురిస్తే ఈ నెల 26వ తేదీ నాటికి వరద 6.50 లక్షల నుంచి 7లక్షల క్యూసెక్కులకు చేరుతుందని జలవనరులశాఖ అధికారుల అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కృష్ణానది పరివాహక ప్రాంతంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. వరద ఉధృతి పెరుగుతుండటంతో ప్రకాశం బ్యారేజీ వద్ద ఒకటో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి వరద నీరు విడుదల చేస్తుండటంతో పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద వరద నీటి ప్రవాహం రోజుకు పెరుగుతోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి 4.50 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో అవనిగడ్డ మండలం యడ్లంక గ్రామస్థులు పడవలపైనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. నాగాయలంక మండలంలోని ఎదురుమొండి, నాచుగుంట, మిగతా 8లో..

వినోదభరితం

వైభవంగా విజయవాడ ఉత్సవ్ సంబరాలు



గాయని గీతామాధురి

- బాణసంచా ఫైరింగ్‌తో ప్రకాశించిన పున్నమి ఘాట్
- ఆకాశంలో ఆకట్టుకున్న డ్రోన్ షో
- అమ్మ రూపాలు, ఆభరణాలు, ప్రకాశం బ్యారేజీ నమూనాల ఆవిష్కరణ
- మధురగానంతో అలరించిన సినీ గాయని గీతా మాధురి

అట్టహాసంగా విజయవాడ ఉత్సవ్ సంబరాలు కొనసాగుతున్నాయి. కళ్లు చెదిరేలా ఆకాశంలో డ్రోన్ షో ప్రదర్శించారు. మధుర గానంతో గీతా మాధురి ఆలపించిన పాటలు యువతను ఉర్రూతలూగించాయి. ఆద్యంతం వినోదభరితంగా పున్నమిఘాట్‌లో కార్యక్రమాలు సాగాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ /విజయవాడ కల్చరల్): సంగీతం, నృత్యం, శాస్త్రీయ ప్రదర్శనలతో కళాకారుల ప్రతిభకు పున్నమిఘాట్ వేదికగా మారింది. సినీ గాయని గీతామాధురి పలు భక్తిగీతాలను ఆలపించి ప్రేక్షకుల్లో ఆధ్యాత్మిక భావాన్ని నింపారు. మెలోడీ నుంచి మాస్ బీట్‌ల వరకు పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. విజయవాడ ఉత్సవ్- 2025లో భాగంగా బుధవారం మూడవ మిగతా 8లో..

పున్నమిఘాట్‌లో జనసందోహం



జేసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లారపు నవీన్



జేసీగా మల్లారపు నవీన్ బాధ్యతల స్వీకరణ

మచిలీపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా మల్లారపు నవీన్ కలెక్టరేట్‌లోని జేసీ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతికి చెందిన నవీన్ 2019 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందినవారు. సత్యసాయి జిల్లా సబ్ కలెక్టర్‌గా, శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, సీఆర్‌డీఏ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా జేసీ నవీన్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికి తొలి ప్రాధాన్యతను ఇస్తానన్నారు. జిల్లాలోని భూ సమస్యలు ధాన్యం సేకరణ, ప్రభుత్వ పథకాల అమలులో నిబంధనలకు మిగతా 8లో..



కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో.. చిత్రంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎంపీ కేశినేని శివనాథ్

దుర్గమ్మ అవతారాలు
ధైర్యం, విజయానికి ప్రతీకలు

» సాంస్కృతిక వైభవానికి ప్రతిరూపం విజయవాడ ఉత్సవ్

» కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్

విజయవాడ సిటీ/లబ్బీపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 'విజయవాడ ఉత్సవ్' ద్వారా 3వేల మంది కళాకారులు, 250కు పైగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించటం అద్భుతమైన విషయం. మన తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబాలైన పండగలు మన జీవన సంస్కృతికి ప్రతీకలు' అని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. విజయవాడ ఉత్సవ్ వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి మాట్లాడుతూ, దసరా సందర్భంగా సంప్రదాయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక శోభతో విజయవాడ మెరిసిపోతుండటాన్ని ప్రశంసించారు. "విజయవాడ రావటం నాకు చాలా సంతోషంగా ఉంది. దుర్గమ్మ తొమ్మిది అవతారాలు ధైర్యం, విజయం, శక్తికి ప్రతీకలు. ప్రతి ఏడాది ఇంద్రకీలాద్రిపై జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా ఉంటాయి" అని షెకావత్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వాన్ని షెకావత్ ప్రశంశించారు. "ఆయన ఒక డైనమిక్ లీడర్. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అమరావతిని ప్రపంచ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దడానికి సీఎం కృషి చేస్తున్నారు.. పరిశుభ్రత, ఆధ్యాత్మికతలో విజయవాడ వేగంగా అభివృద్ధి చెందుతోంది" అని అన్నారు. 'వికసిత భారత కోసం ప్రధాని కృషి చేస్తున్నారు. అదే దిశలో వికసిత ఆంధ్రప్రదేశ్ కోసం సీఎం చంద్రబాబు ముందుకు తీసుకువెళ్తున్నారు. కలిసి మాట్లాడుదాం, కలిసి ముందుకు సాగుదాం" అని షెకావత్ పిలుపునిచ్చారు.

దుర్గమ్మను దర్శించుకున్న కేంద్రమంత్రి..

దసరా ఉత్సవాల్లో భాగంగా కేంద్ర మంతి గజేంద్రసింగ్ షెకావత్ బుధవారం అమ్మవారిని దర్శించుకున్నారు. అయనతో పాటు మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్‌లు దర్శించుకున్నారు. మంత్రిని అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతించి, దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనలు, అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద కేంద్ర మంత్రి షెకావత్ మాట్లాడుతూ దసరా ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఏర్పాట్లు బాగున్నాయి : రఘురామకృష్ణరాజు



చిట్టినగర్ : దసరా శరన్నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్ నేతృత్వంలో నవరాత్రి ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లు బాగా చేశారని శాసన సభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణరాజు అన్నారు. బుధవారం ఆయన అన్నపూర్ణాదేవి అలంకృత జగన్మాతను దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను వేద పండితులు అందజేశారు. ఆయనతోపాటు చిత్తూరు శాసనసభ్యుడు గురజాల జగన్మోహన్ జగన్మాతను దర్శించుకున్నారు.

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

సాధారణ భక్తుల దర్శనాలకు పెద్దపీట వేసస్తున్నామని మాటల్లో కాకుండా చేతల్లో చూపుతున్న కూటమి ప్రభుత్వం నవరాత్రి ఉత్సవాలకు చేసిన ఏర్పాట్ల పట్ల ప్రజలు ఆనందంగా ఉన్నారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఇంద్రకీలాద్రిపై జగన్మాతను ఆమె దర్శించుకున్నారు. అలాగే ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను అన్నపూర్ణాదేవి అలంకారంలో మాజీ మంత్రి రోజా దర్శించుకొని పూజలు చేశారు.

అమ్మ సన్నిధిలో..



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ బుధవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూడో రోజున భక్తులు పోటెత్తారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.





అన్నపూర్ణా దేవి అలంకారంలో దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు



'అమ్మ' సేవలో..

సృష్టిలో అమ్మ ప్రేమను మించింది లేదనడానికీ, అమ్మ త్యాగానికి సాటి మరేది రాదన్నదానికి నిలువెత్తు నిదర్శనం ఈ చిత్రం. ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో విధులు నిర్వహించేందుకు వచ్చిన ఓ మహిళా కానిస్టేబుల్ తన ఏడాదిలోపు పసికందును కడుపునకు ఒత్తుకుని విధులు నిర్వహిస్తు.. దుర్గమ్మ భక్తులకు సేవలను అందిస్తోంది. - పాయకాపురం

శ్రీకాళహస్తి దేవస్థానం తరపున
అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పణ



ఇంద్రకీలాద్రి : అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మకు శ్రీకాళహస్తి దేవస్థానం తరపున పట్టు వస్త్రాలు, సారెను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ కుమార్, శ్రీకాళహస్తి దేవస్థాన ఈవో టి.బాపి రెడ్డి సమర్పించారు. శ్రీజ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వర ఆలయం నుంచి అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించడం ఆనవాయితీ అని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండి, అభివృద్ధి పథంలో సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఈవో శీనానాయక్, అర్చక బృందం వారికి స్వాగతం పలికారు. కాళహస్తీశ్వరుడు, జ్ఞాన ప్రసూనాంబల ఫోటోను, శేషవస్త్రంను ఈవో శీనానాయక్‌కు అందజేశారు. ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా మహోత్సవాలలో రెండోరోజు మంగళవారం దేవస్థానానికి వివిధ రూపాలలో మొత్తం రూ.31,30,960లు ఆదాయం సమకూ

ఆదాయం రూ.31.30 లక్షలు

రినట్టు దేవస్థానం ఈవో వీకే శీనానాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.300లు టిక్కెట్‌ల ద్వారా రూ.10,56,300లు, రూ.100లు టిక్కెట్ల ద్వారా రూ.3,46,400లు, లడ్డూప్రసాదం (ఒక్కొక్క లడ్డూ రూ.15లు) ద్వారా రూ.2,98,870లు, రూ.100ల లడ్డూ ద్వారా రూ.11,89,800లు లభించినట్లు పేర్కొన్నారు. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చనల (టిక్కెట్టు రూ.3వేలు) టిక్కెట్టుల ద్వారా రూ.93వేలు, పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన (టిక్కెట్టు రూ.5వేలు) టిక్కెట్‌ల ద్వారా రూ.45వేలు, ప్రత్యేక ఖడ్గమాలార్చన (టిక్కెట్ రూ.5,116లు) టిక్కెట్ల ద్వారా రూ.25,580లు, పుస్తకాలు, ఫోటోలు, క్యాలెండర్ల ద్వారా రూ.10,325లు, తలనీలాల సమర్పణకు (టిక్కెట్‌రూ.40) టిక్కెట్ల ద్వారా రూ.39,520లు, ప్రసాదం విక్రయం ద్వారా యుపిఐలో జమ అయిన రూ.22,315లు, ఇతరత్రా ఆదాయం రూ.3,850లు మొత్తం కలిపి రూ.31,30,960లు లభించినట్టు ఈవో వివరించారు.

భారీ వర్షం .. తడిసి ముద్దయిన భక్తులు

(ఆంధ్రజ్యోతి, లబ్బీపేట) : ఇంద్రకీలాద్రిపై బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో క్యూ లైన్‌లో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్యూలైన్ పై కప్పు నుంచి వర్షపునీరు కారడంతో భక్తులు మొత్తం తడిసిపోయారు. దాదాపుగా 10 నిమిషాల పాటు ఏకధాటిగా భారీ వర్షం దంచి కొట్టింది. తర్వాత వర్షం ఆగడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. యధావిధిగా దర్శనాలు చేసుకున్నారు.

బుధవారం రాత్రి వర్షం కారణంగా ఇంద్రకీలాద్రిపై క్యూలో ఇబ్బందులు పడుతున్న భక్తుల





సెల్ఫీ టైమ్..



అన్నపూర్ణ సన్నిధిలో..

అమ్మవారి దర్శనానంతరం అన్నప్రసాదం తీసుకుంటున్న భక్తులు



రథం సెంటర్ వద్ద భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న హిజ్రాలు

హిజ్రాలతో భక్తుల ఇక్కట్లు!

విజయవాడ రూరల్ : దసరా ఉత్సవాలకు వచ్చిన భక్తులకు హిజ్రాల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అమ్మవారి దర్శనం అనంతరం కొండ దిగి వచ్చిన భక్తుల కోసం మార్గమధ్యలో హిజ్రాలు కాపుకాసి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రసాదం కౌంటర్ల నుంచి బయటకు వచ్చిన దగ్గర నుంచి రథం సెంటర్ వరకు హిజ్రాలు గ్రూపులుగా చేరి భక్తుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. కొందరు భక్తులు ఇష్టపడి ఇస్తే.. మరికొందరు అయిష్టంగానే ఎంతో కొంత నగదు చేతిలో పెట్టి వెళ్లాల్సి వస్తున్నది. అయితే సమీపంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు కూడా వీరికి అడ్డుచెప్పకపోవడంతో భక్తుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

విశ్వనాథ వీరంగం!

» ఇంద్రకీలాద్రిపై తలుపులమ్మ ఆలయ ఈవో ఓవరాక్షన్

» కానిస్టేబుల్ పట్ల అవమానకర ప్రవర్తన



కానిస్టేబుల్ మెడలో కార్డు లాగేస్తున్న విశ్వనాథరాజు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) కాకినాడ జిల్లా తలుపులమ్మ దేవస్థానం ఈవో విశ్వనాథరాజు ఇంద్రకీలాద్రిపై వీరంగం చేశారు. దేవస్థానంలో మొత్తం పెత్తనం తనదే అన్నట్టుగా వ్యవహరించారు. వీఐపీ క్యూ మార్గంలో కానిస్టేబుల్ పట్ల అనుచితంగా ప్రవర్తించారు. వన్ టౌన్ కానిస్టేబుల్ గురువులు ఇంద్రకీలాద్రిపై ప్రొటోకాల్ వ్యవహారాలు చూస్తున్నారు. అధికారులు గురువులుకు డ్యూటీ పాస్‌ను జారీచేశారు. విధి నిర్వహణలో భాగంగా గురువులు వీఐపీ క్యూ వద్ద నుంచి రాజగోపురం వైపునకు వెళ్తుండగా అక్కడే ఉన్న విశ్వనాథరాజు గేటు దగ్గర ఆపారు. తాను పోలీసు కానిస్టేబుల్‌నని గురువులు చెప్పారు. మెడలో వేసుకున్న డ్యూటీపాస్‌ను విశ్వనాథరాజుకు చూపించారు. పాస్ ఫొటోలో ఉన్నది నువ్వేనా.. అంటూ దురుసుగా మాట్లాడారు. పాస్‌ను తెంచేశారు. దీనితో గురువులు జేబులో ఉన్న పోలీసుశాఖ గుర్తింపుకార్డును చూపగా చిత్కారంగా మాట్లాడుతూ గురువులపై విశ్వనాథరాజు వీరంగం చేస్తుండటంతో చుట్టుపక్కల ఉన్న అధికారులు, మీడియా ప్రతినిధులు ఇదేం పద్ధతి అని ప్రశ్నిస్తుండగా సమాధానం చెప్పకుండా విశ్వనాథరాజు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఒక దేవస్థానానికి ఈవో హోదాలో ఉన్న అధికారి ఇలా ప్రవర్తించడంపై క్యూల్లో ఉన్న భక్తులు విస్తుపోయారు.

కుర్చీల కోసం సేవకుల నిరసన!

» దసరా ఉత్సవ సేవా సభ్యుల తీరుపై భక్తుల ఆగ్రహం

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారిని దర్శించుకోవటానికి వచ్చే భక్తులకు సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం దసరా ఉత్సవాల సేవా సభ్యులను నియమిస్తే.. తమకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కోరుతూ మంగళవారం కొండపై చిన్నరాజగోపురం వద్ద సేవాసభ్యులు నిరసన వ్యక్తం చేసిన



కొండపై తమకు కుర్చీలు కేటాయించాలంటూ కింద కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న దసరా ఉత్సవాల సేవా సభ్యులు

సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం దుర్గగుడిపై దసరా ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు సేవలు అందించేందుకు 96మంది సభ్యులతో దసరా ఉత్సవాల సేవా కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఉత్సవాల ప్రారంభం మొదటిరోజులోనే సభ్యులకు దేవస్థానం అధికారులు ఇద్దరు అటెండర్లను నియమించారు. వారికి కావాల్సిన వసతులు కల్పించారు. మొదటిరోజునే దేవస్థానంపై హడావుడి చేస్తూ తమవెంట పదుల సంఖ్యలో జనాన్ని తీసుకువెళ్లి దర్శనాలను చేయించారు. రెండోరోజు నుంచి తమను కొండదిగువన మహామండపం నుంచి లిఫ్ట్‌ల ద్వారా పోలీసులు పైకి రాకుండా అడ్డుకుంటున్నారని, పోలీసులను అడ్డుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులకు సూచించారు. అలాగే ప్రతిరోజూ ఒక్కొక్కరికి 30 వీఐపీ టిక్కెట్లు కేటాయించాలని, కొండపై చిన్న రాజగోపురం వద్ద ప్రత్యేకంగా తమకు కుర్చీలు ఏర్పాటు చేయాలని దేవస్థానం అధికారులకు సూచించారు. దేవస్థానం అధికారులు వారి సూచనల మేరకు కుర్చీలు ఏర్పాటు చేయటంలో జాప్యం జరగటంతో 10 మందికి పైగా సభ్యులు కింద కూర్చొని నిరసన వ్యక్తంచేశారు. వీరి తీరుపై భక్తులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులకు సేవలు అందించాల్సిన సేవా సభ్యులే ఆలయంలో నిరసన వ్యక్తం చేయటమేమిటంటూ పలువురు ప్రశ్నించారు. సభ్యులు నిరసన చేస్తున్నారని సమాచారం తెలుసుకున్న ఆలయ అధికారులు వారికి ప్రత్యేకంగా కుర్చీలు ఏర్పాటు చేశారు.

కృష్ణమ్మ పరుగులు!

(7వ పేజీ తరువాయి)

ఈలచెట్లదిబ్బ తదితర గ్రామాల వద్ద కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది.

పంటలకు పొంచి ఉన్న ముప్పు

కృష్ణానది వెంబడి ఉన్న లంకగ్రామాల్లో చెరకు, కంద, మొక్కజొన్న, తమలపాకు, పసుపు, పూలతోటలు, కూరగాయల తోటలు, మల్బరీ తోటలు సాగులో ఉన్నాయి. ప్రస్తుతం వస్తున్న వరద కారణంగా లంక భూముల్లోని పల్లపు ప్రాంతాల్లోకి నీరు వచ్చి చేరే ప్రమాదం పొంచి ఉంది. వరద నీటి ప్రవాహం ఐదు లక్షల క్యూసెక్కులకు పెరిగితే చల్లపల్లి మండలం నడకుదురు గ్రామ పరిధిలోని కరకట్ట వెంట ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాల్లో సాగు చేసిన పసుపు, కంద తోటల్లోకి వరద నీరు చేరే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కంద పంట మరో నెల రోజుల్లో చేతికి వస్తుందని, ఈ తరుణంలో పంట నీట మునిగితే కంద దుంపలు భూమిలోనే కుళ్లిపోతాయని చెబుతున్నారు. పసుపు పంటను సాగు చేసి మూడు నెలలు అయ్యిందని, మొక్కదశలో ఉన్న పసుపు వారం రోజులకు పైన నీటిలోనే ఉండిపోతే చనిపోతుందని అంటున్నారు. మోపిదేవి మండలం కే కొత్తపాలెం, మోపిదేవి వార్పు, బొబ్బర్లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో పంట పొలాల్లోకి వరద నీరు చేరే అవకాశం ఉందని రైతులు భయపడుతున్నారు.

వినోదభరితం

(7వ పేజీ తరువాయి)

రోజు కార్యక్రమాలు అద్భుతంగా సాగాయి. ఆద్యంతం యువతలో జోష్ నింపాయి. శ్రవ్య మానస బృందం చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఆంజనేయ విశ్వ స్వరూపం, నరసింహ అవతారం ఉగ్రరూపాన్ని, కాంతారా అభినయాన్ని కూచిపూడి నృత్యంతో కలిపి ఈ బృందం ప్రదర్శించి ప్రేక్షక ఆదరణ పొందింది.

కళ్లు చెదిరే క్రాకర్స్, డ్రోన్ షో

పున్నమి ఘాట్ వద్ద వేలాది డ్రోన్‌లతో చేసిన షో ప్రేక్షకులను మైమరిపించింది. ఆకాశంలో కనకదుర్గమ్మ వివిధ రూపాలను డ్రోన్ లైటింగ్‌తో ప్రదర్శించిన తీరు చూపరులను మంత్రముగ్ధుల్ని చేసింది. ప్రకాశం బ్యారేజీ, అమ్మవారి అలంకరణకు ఉపయోగించే బంగారు ఆభరణాలను ప్రదర్శించి భక్తులకు ఆధ్యాత్మిక వినోదాన్ని అందించారు. దీనికంటే ముందుగా జరిగిన క్రాకర్స్ షో ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యానికి గురిచేసింది. ఏడు నిమిషాల పాటు ఆగకుండా ఆకాశానికి రంగులద్దిన తీరును అక్కడున్న ప్రజలు కనురెప్ప వేయకుండా చూశారు. ఈ సుందర దృశ్యాన్ని అనేకమంది తమ సెల్‌ఫోన్లలో బంధించి ఆనందాన్ని పొందారు.

ఆకట్టుకున్న మహాభారత రూపకల్పన

కళాకారిణి దీప్తి ఆమె బృందం మహాభారతంలోని కీలక ఘట్టాలను అద్భుతంగా ప్రదర్శించారు. శిల్పసుందరమైన హావభావాలు, అభినయంతో పాండవ, కౌరవ కథలు వేదికపై ప్రత్యక్షమయ్యాయి. గీత భక్తి ప్రదర్శనలో ఆధ్యాత్మికత, భక్తిరసాన్ని ఒలకబోసి, ప్రేక్షకులను ఆత్మీయ లోకంలోకి తీసుకెళ్లారు. వైలిన్ మాధుర్యం సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేసింది. కామాక్షి ఆమె బృందం చేసిన వైలిన్ వాయిద్య కచేరీ ఆకట్టుకున్నాయి. స్వరసమూహాలు పున్నమి ఘాట్ తీరాన్ని ఒక సంగీత నిలయంగా మార్చేశాయి.

సాంస్కృతిక, నాటకాల జోష్

విజయవాడ ఉత్సవ్ కళామహోత్సవంగా మారింది. సత్యనారాయణపురంలోని సంగీత కళాశాల, తుమ్మలపల్లి కళాక్షేత్రం, పున్నమిఘాట్ కళావేదికలు నిండైన సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకలోకానికి కనువిందు చేశాయి. సంగీత కళాశాలలో నగరానికి చెందిన జీ.నీలవేణి కథక్ నృత్యంతో(సోలో) అలరించింది. కాలభైరవ అష్టకం, శివనందన అంశాలతో నర్తించారు. చిట్టా రామలక్ష్మి బృందం వీణ వాద్యంతో బృంద కచేరి చేసి అలరించారు. గజానన యుద్ధం, బంటురీతి కొలువు అంశాలను చక్కగా పలికించారు. భాగవతుల సౌమ్య భరతనాట్యంతో అన్నమాచార్యుల సంకీర్తనకు నర్తించారు. అనంతపురానికి చెందిన సి.రాము ఉరుముల వాద్యంతో రామాయణంలోని కథాంశాలతో పిట్టకథలను జోడించి చక్కని గానం చేశారు. సత్యసాయి నాట్యమండలి బృందం ప్రదర్శించిన సత్య హరిచ్చంద్ర నాటకంలోని వారణాసి, కాటి సీన్లు రక్తికట్టించాయి. హరిచ్చంద్రుడిగా ఫణిశంకర్ గౌడ్, చంద్రమతిగా డాక్టర్ రత్నశ్రీ నటభారతి, నక్షత్రుడిగా చీమకుర్తి ఆంజనేయులు, వీరబాహుడిగా దంపూరి దుర్గాప్రసాద్ అద్భుతమైన నటనాభినయ పద్యగాన, వాక్చతుర్యంతో మెప్పించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నగరానికి చెందిన నాట్యాచారిణి అపర్ణ బృందం ఓంకార రూపిణి, అన్నపూర్ణాదేవి అర్చించునమ్మ లాంటి భక్తిగీతాలకు నయనానందకరమైన నాట్యంచేసి రంజింపచేశారు.

జేసీగా నవీన్ బాధ్యతల స్వీకరణ

(7వ పేజీ తరువాయి)

అనుగుణంగా పనిచేస్తానని వివరించారు. సీఆర్‌డీఏ పరిధిలో జిల్లాలోని కొంత భాగం ఉండటం వల్ల ఆయా ప్రాంతాలపై అవగాహన ఉందని తెలిపారు. జేసీని డీఆర్వో కె.చంద్రశేఖరరావు, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, పౌరసరఫరాలసంస్థ జిల్లా మేనేజర్ శివరాంప్రసాద్, డీఎస్‌వో మోహన్‌బాబు, ఆర్డీవో కె.స్వాతి, మార్కెటింగ్ ఏడీ నిత్యానందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ బాలాజీని జేసీ నవీన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

అడ్డంగా బుక్ అయ్యారు!

(7వ పేజీ తరువాయి)

అబాసుపాలయ్యారు. వివరాల్లోకి వెళితే... కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో వన్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతోంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 21న 'అరణ్యరోదన' శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అటవీశాఖ అధికారుల బృందం కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌కు వెళ్లింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జల్లెడ పట్టామని.. ఎలాంటి వన్యప్రాణుల వేట జరగలేదని సెలవిచ్చారు. కొండపల్లి అడవిలో తిరిగిన దృశ్యాలకు సంబంధించిన ఫొటోలను విడుదల చేశారు. ఈ ఫొటోలే సాక్ష్యాలుగా మారాయి. తాము కొండపల్లి అడవిని సందర్శించామని చెప్పుకోవటానికి గూగుల్ కెమెరాతో ఫొటోలు తీశారు. దీంతో ఫొటోలో చివరన 'గూగుల్ కో ఆర్డినేట్స్' ప్రింట్ అవుతాయి. ఇది జియో లోకేషన్‌ను ధ్రువపరుస్తుంది. అటవీశాఖ అధికారుల బృందం కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌కు వెళ్లిన మాట వాస్తవం. దీనికి జియో కోఆర్డినేట్స్ ఉన్న ఫొటోలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. అక్కడ ఏమీ జరగలేదని వారు చెప్పింది మాత్రం అవాస్తవం. ఎందుకంటే.. ఈ నెల 23వ తేదీన అదే కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న దుప్పి, చనిపోయి కుళ్లిన స్థితిలో ఉన్న మరో దుప్పి దృశ్యాలను ప్రత్యక్షంగా చూసిన వారు కూడా గూగుల్ కెమెరాతోనే ఫొటోలు తీసి వాటిని వెలుగులోకి తీసుకురావటం జరిగింది. వాటిపైనా జియోగ్రాఫికల్ కో ఆర్డినేట్స్ ప్రింట్ అయ్యాయి. 'ఆంధ్రజ్యోతి' చేతికి చిక్కిన తాజా దృశ్యాలలో అక్షాంశం 16.63662 ఉండగా.. రేఖాంశం 80.471982 ఉంది. అటవీశాఖ అధికారులు విడుదల చేసిన గూగుల్ కెమెరా ఫొటోలలో కూడా అక్షాంశం 16.677092, రేఖాంశం 80.527265గా ఉంది. వివిధ ఫొటోలు దాదాపుగా ఇదే కోఆర్డినేట్స్‌ను కొన్ని పాయింట్లు అటు, ఇటుగా చూపించటం జరిగింది. దీనిని బట్టి ఆ ఫొటోలు కొండపల్లి అటవీ ప్రాంతంలోనివేనని తేలిపోయింది. కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ పరిధి 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉంది. గూగుల్ కెమెరా ఏ రోజున ఏ సమయంలో ఫొటో తీయటం జరిగిందో కూడా ఆ ప్రింట్‌లో పేర్కొంది. దీనిని బట్టి ఎవరిది అబద్ధమో బట్టబయలైపోయింది.

అటవీశాఖ అధికారుల పరిశీలన

'ఆగని వన్యప్రాణుల వేట' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం మరో కథనం ప్రచురితమైన నేపథ్యంలో అటవీశాఖ అధికారులు కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ లోపలికి వెళ్లి పరిశీలించారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ అక్షాంశ, రేఖాంశాలను బట్టి చూస్తే అది కేతనకొండ దగ్గర ఉందని చెప్పారు. ఆ ప్రాంతానికి వెళ్లి చూడగా.. తమకు ఉచ్చులు కనిపించలేదని చెప్పారు. స్థానికులు కూడా ఇదే చెప్పారని చెప్పటం గమనార్హం.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి



గన్నవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని ఐలు రాష్ట్ర నాయకుడు అనుమోలు వెంకటేశ్వరరావు అన్నారు. అఖిల భారత న్యాయవాదుల సంఘం పిలుపు మేరకు స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు దగ్గర బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన రూ.100కోట్లు గ్రాంటును ఏపీ బార్ కౌన్సిల్‌కు జమ చేయాలని కోరారు. న్యాయవాదులుఎస్వి సాంబశివరావు, యు.సక్కుబాయి, టి.వెంకయ్య, భాస్కర్, బదరినాద్, వాసుదేవరావు, కృష్ణకిషోర్, జాస్తి తాతారావు, వాసవి విశ్వనాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయవాడ రోడ్డులోని కిక్ వైన్‌షాపులో బుధవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి రూ.13వేలు విలువ చేసే మద్యం సీసాలను దొంగిలించారు. దీంతో పాటు దుకాణం ఎదుట ఉన్న పాన్‌షాపులో కూడా రూ.20 వేలు విలువ చేసే సిగరెట్లు, ఇతర సరుకులు అపహరించారు. వైన్‌షాపులో పనిచేసే క్యాషీ యర్ సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అర్ధరాత్రి దాటిన తరువాత దుకాణాం షట్టర్ తాళాలు పగులకొట్టి చోరీకి దుండగులు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు.

ధనేకుల కళాశాలలో క్యూజీఐఎస్‌పై వర్క్‌షాప్

పెనమలూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ విభాగంలో క్యూజీఐఎస్ అప్లికేషన్స్ పై వర్క్‌షాప్ నిర్వహించారు. జియోవిద్య వ్యవస్థాపకులు డాక్టర్ కాశి పొన్నపల్లి విద్యార్థులతో మాట్లాడుతూ, శాటిలైట్ సర్వేయింగ్, ఎర్త్‌స్పేస్ మేనేజిమెంటుపై తగు సూచనలు చేశారు. చైర్మన్ ధనేకుల రవీంద్రనాద్ ఠాగూర్, కరస్పాండెంట్ ధనేకుల భవానీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల, డాక్టర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం- ఏలూరు కాలువ అనుసంధానానికి నిధులు మంజూరు చేయాలి

అసెంబ్లీలో యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, 24 సెప్టెంబరు (ఆంధ్ర జ్యోతి) : పోలవరం కుడికాలువను ఏలూరు కాలువతో అనుసంధానానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాల్లో భాగంగా బుధవారం జరిగిన సమావేశంలో యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, పోలవరం కుడి కాలువ నీరు ప్రకాశం బ్యారేజీ వరకు వెళ్లి తిరిగి ఏలూరు కాలువ ద్వారా బాపులపాడు మండలానికి రావడానికి సుమారు 50 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందని, ఈ రెండు కాలువలను బాపులపాడు మండలంలోని అంపాపురం వద్ద అనుసంధానం చేస్తే కాలువ చివరి గ్రామాలకు సాగునీటి కొరత తీరుతుందన్నారు. ఈ అనుసంధానానికి గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రూ.15.60 కోట్ల నిధులు మంజూరు చేసినా వివిధ కారణాలతో పనులు ప్రారంభం కాలేదన్నారు. ఈ పనులకు తక్షణమే నిధులు మం జూరు చేయాలని కోరా రు. గత ఏడాది వచ్చిన వరదల కారణం గా బుడమేరుకు 39 చోట్ల గండ్లు పడితే వాటిని పూడ్చేందుకు రూ. 9 కోట్లు నిధులు మంజూరు చేసిన ముఖ్య మంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. 2008లో సున్నలో 3.50 ఎకరాల భూమిని జర్నలిస్ట్ కాలనీకి కేటాయించగా ఆక్రమణ లపాలై ప్రస్తుతం 2.50 ఎకరాలు మాత్రమే ఉందని ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ కాలనీలో జర్నలిస్టులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పేద ప్రజలకు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇచ్చేందుకు ప్రభు త్వం నిర్ణయించిందని, జర్నలిస్టులకు ఒక సెంటు అదనంగా ఇవ్వాలని గత అసెంబ్లీ సమావేశాల్లో తన కోరగా స్పందించిన మంత్రి పార్థసారథి కమి టీని ఏర్పాటు చేశారని సాధ్యమైనంత త్వరలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్‌లో ప్రస్తావిస్తున్న అంశాలకు సంబంధించి ఎమ్మెల్యేలకు తిరుగు సమాచారం ఇవ్వటం లేదని దీనివల్ల తాము ప్రస్తావించిన అంశాలు ఏస్టేజిలో ఉన్నాయో తెలుసుకు నేందుకు వీలు లేకకుండా పోతుం దన్నారు. జీరో అవర్‌కు తగిన ప్రాముఖ్యత నివ్వాలని వెంకట్రావు కోరారు.



సీఎం సహాయనిధి ఎల్వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

సీఎం సహాయనిధి ఎల్వోసీ అందజేత

ప్రసాదంపాడు : గన్నవరం నియోజకవర్గంలోని ఇద్దరికీ వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.3.50 లక్షల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విజయవాడ క్యాంపు కార్యాలయంలో బుధవారం అందజేశారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు గ్రామానికి చెందిన బేవర కుమారికి రూ.2 లక్షలు, గన్నవరం మండలం చిక్కవరం గ్రామానికి చెందిన బుద్ధాల రామదాసుకు రూ. 1.5 లక్షలు ఎల్‌వోసీలను అందించారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న గోగినేని శివరామకృష్ణ తదితరులు

కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకు వెళుతోందని సీనియర్ టీడీపీ నేత గోగినేని శివరామకృష్ణ తెలిపారు. తన ఆధ్వర్యంలో ముద్రించిన 15నెలల పాలనలో రాష్ట్రాభివృద్ధి బుక్‌లెట్‌ను బుధవారం స్థానిక పున్నమ్మ కాంప్లెక్సు ఆవరణలో టీడీపీ నాయకులు సమక్షంలో ఆవిష్కరించి పంపిణీ చేశారు. బుక్‌లెట్‌లను సీఎం చంద్రబాబుతో పాటు పలువురు ఎమ్మెల్యేలకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నేతలు నందిగం స్వామి, గుమ్మడి శేషగిరిరావు, యలమంచిలి శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

పాముకాటుతో యువకుడి మృతి



హర్షవర్ధన్ (ఫైల్)

ఉంగుటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుకు గురైన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఉంగుటూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉంగుటూరు వెలమపేటకు చెందిన గొల్ల శంకరరావు కుమారుడు హర్షవర్ధన్(18) భీమవరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నాడు. దసరా పండుగ సెలవులకు ఈ నెల 14న స్వగ్రామానికి వచ్చాడు. దసరా మహోత్సవాల్లో భాగంగా యువకులంతా కలిసి స్థానిక రామాలయంలో దుర్గాదేవి ప్రతిమను ప్రతిష్ఠించి నవరాత్రి వేడుకలు చేయాలని నిర్ణయించుకున్నారు. 20న శనివారం గుడివాడలో దుర్గాదేవి విగ్రహాన్ని కొనుగోలు చేసి రాత్రి ఉంగుటూరు సెంటర్‌కు తీసుకువచ్చారు. ఈ క్రమంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీటిలో నడిచివెళ్తున్న హర్షవర్ధన్ కుడికాలు చిటికిన వేలుపై పాముకాటు వేసింది. వెంటనే స్థానిక ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లి వైద్యం చేయించారు. 21న కాలివేలు బాగా వాచిపోయి నల్లగా మారడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గన్నవరం, అక్కడ నుంచి 108 అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 23న రాత్రి మృతి చెందాడు.



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి

పెనమలూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. బుధవారం తాడిగడప మునిసిపాలిటీ పోరంకిలో రూ. 31లక్షల సాధారణ నిధులతో నిర్మించనున్న చెక్కవారి మేడ రోడ్డుకు శంకుస్థాపన చేసి ఎమ్మెల్యే మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి అనేది మచ్చుకు కూడా కనిపించేది కాదని, రోడ్లన్నీ పాడైపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కొండా ప్రవీణ్, బోడె సురేంద్ర, యేకుల విజయేంద్ర, యార్ల చక్రవర్తి, బొంగరాల అబ్రహం పాల్గొన్నారు.



సర్టిఫికెట్‌లు పొందిన విద్యార్థులతో వీసీ, ప్రొ.వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు విస్తృత పరచాలి

కానూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు విస్తృత పరిచి, సమాజంలో మార్పులకు కారకులు కావాలని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో బుధవారం ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ వెంకటేశ్వరరావు, గౌరవ అతిథులుగా ప్రొ.వీసీ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం. రవిచంద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. శివరాంప్రసాద్‌లు పాల్గొని జ్యోతిని వెలగించి కార్యక్రమం ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా దశాబ్దన్నర పాటు సేవలు అందించిన డాక్టర్ కె. నరేంద్రను ఘనంగా సత్కరించి ఈయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు డాక్టర్ కె. మాధవి, డాక్టర్ పి. సుష్మాచౌదరి, డాక్టర్ ఎ. వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఉంగుటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శ్మశానవాటికల అభివృద్ధి పట్ల దాతలు దృష్టి సారించాలని సింధు కన్‌స్ట్రక్షన్స్ అధినేత కొరివి శ్రీను అన్నారు. మండలంలోని కొయ్యగూరపాడు హిందూ శ్మశాన వాటికలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న షెడ్డు నిర్మాణానికి బుధవారం గ్రామస్థులంతా కలిసి సామూహిక భూమిపూజ నిర్వహించారు. శ్మశానవాటికలో మృతదేహాలకు దహనసంస్కారాలు నిర్వహించేందుకు మృతుల కుటుంబసభ్యులు ఇబ్బందులు పడుతున్న క్రమంలో గ్రామానికి చెందిన దోనేపూడి రంగారావు ముందుకువచ్చి తన సొంత ఖర్చులతో షెడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.





గన్నవరం కన్యకపరమేశ్వరీ ఆలయం, కాటూరులో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా దేవీ శరన్నవరాత్రులు

గన్నవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక కన్యకపరమేశ్వరీ ఆలయంలో భక్తులకు శ్రీకాశీ అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. శ్రీకాకుళపు సత్యనారాయణ(సాయి), విజయలక్ష్మీ, కనమర్లపూడి వెంకట నాగ సురేష్, రాజ్యలక్ష్మీ దంపతులు పూజలు నిర్వహించారు. పాత గన్నవరం, గాయత్రి మందిరం, వెంకటేశ్వరస్వామి ఆలయం, యాదవుల రామాలయం, కేసరపల్లి భువనేశ్వరీ పీఠంలో పూజలు కొనసాగుతున్నాయి.

హనుమాన్‌జంక్షన్: దేవీ శరన్నవరాత్రులు సందర్భంగా స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం రాజరాజేశ్వరిదేవిని ధాన్యలక్ష్మీగా అలంకరించి ఘనంగా నిర్వహించారు. ఏలూరు రోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కన్యకాపరమేశ్వరి దేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. బాపులపాడు శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయంలో భ్రమరాంబికాదేవిని కూడా అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మల్లవల్లిలో పోలవరపు బాపనయ్య దంపతులు ప్రత్యేకపూజ నిర్వహించారు. రంగన్నగూడెంలో బ్రహ్మం దంపతులు ప్రత్యేకపూజ నిర్వహించారు. కొత్తపల్లిలో అన్నపూర్ణదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి 1500 మందికి పైగా భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

ఉయ్యూరు : కాటూరు దుర్గా మండపంలో జరిగిన పూజలో నిడుమోలు పూర్ణ చంద్రరావు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాజుపేట, ఇతర గ్రామాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమేశ్వరస్వామి ఆలయంలో గజలక్ష్మీదేవిగా అమ్మవారిని అలంకరించారు.

కానూరు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తాడిగడప మున్సిపాలిటీ కానూరు సనత్‌నగర్ ఐదవ లైన్ డీఎస్‌పీ రోడ్డులో నిలిపిన అమ్మవారు బుధవారం అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉంగుటూరు : ఆత్కూరు శ్రీకనకదుర్గా అమ్మవారి ఆలయం, లంకపల్లి శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో శ్రీఅన్నపూర్ణాదేవి, గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళాభక్తులు సామూహిక కుంకుమార్చనతో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

ఈక్రాప్ నమోదుతో రైతుకు మేలు

హనుమాన్‌జంక్షన్ రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : ప్రతి రైతు సాగు చేసిన పంటలను ఈక్రాప్ బుకింగ్ ద్వారా నమోదు చేయడం వల్ల వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర, సబ్సిడీలు పొందడంతో పాటు బీమా సౌకర్యం వల్ల మేలు జరుగుతుందని ఏవో బి.రంగనాథ్ బాబు, ఉద్యానశాఖ అధికారి జోసఫ్ తెలిపారు. మడిచర్ల, కొత్తపల్లి గ్రామాల్లో బుధవారం ఆయిల్‌పామ్ తోటలు, వరిపంట, మినుము సాగును, ఈ క్రాప్ నమోదును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వాతావరణ పరిస్థితుల వల్ల పంట నష్టపోయినా, తక్కువ వడ్డీకి పంట రుణాలు పొందాలన్నా, ప్రభుత్వం అందించే సబ్సిడీలు, పథకాలకు అర్హత పొందాలన్నా ఈక్రాప్ నమోదు తప్పనిసరి అని సూచించారు. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు ఈక్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. మోటూరి శ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు పిడికిటి రాంబాబు, డీసీ చైర్మన్ దేవినేని సత్యనా రాయణ పాల్గొన్నారు.

కళా సంగమం



చిన్నారులతో కేరింతలు కొట్టించిన వెంట్రిలాక్విజం

దుమ్ములేపిన జానపద నృత్యాలు చిందేయించిన రింగు డ్యాన్స్

విజయవాడ కల్చరల్/ఇబ్రహీం పట్నం, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): పవిత్ర సంగమం కళా కదంబంగా మారింది. శాస్త్రీయ, జానపద, గాత్ర నృత్యాలు, మిమిక్రీ, రింగ్ డ్యాన్స్, వెంట్రిలాక్విజం, వేంకటేశ్వర కల్యాణ రూపకం వంటి ప్రదర్శనలతో ప్రేక్షకులు ఆద్యంతం పరవశించారు. నాట్యకారిణి పావని శిష్య బృందంలోని 20 మంది విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యాలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. ఆడోస్తా జానకి కోడి పందెం, మందులోడా ఓరి మాయలోడా, వస్తావా జానకి, నర్సపల్లె ఆడ నెమలి వంటి గ్రామీణ జానపద అల్లికలతో మధురంగా పాడి ప్రేక్షకుల చేత చిందులేయించారు. మరోవైపు నాట్యమయూరి సీహెచ్ అవీషా చౌదరి, 25 విద్యార్థులు కూచిపూడి నాట్యాలు, రింగు డ్యాన్స్‌లతో సభికలోకాన్ని ఉర్రూతలూగించారు.

బృందావన నీలాగే, మూషిక వదన, సరస్వతి నమస్తుభ్యం శారదే, జయజయ దుర్గే, బీ ప్రీ ఫ్యూజన్, శివశివ శంకర హరహర శంకర, అయిగిరినందిని ఫ్యూజన్, శివాష్టకం, లింగాష్టకం, శాంపేయ గౌరాయ శరీర కాయ వంటి అంశాలతో ఫ్యూజన్, రింగు డ్యాన్సులు ఆహూతలను కట్టిపడేశాయి. అనంతరం తన్మయ శిష్య బృందం అన్నమయ్య పాటలతో రూపుదిద్దిన శ్రీనివాస కల్యాణం, నారాయణ సుగుణ బ్రహ్మణే, బృందావన మాళి రారా మా ఇంటికి ఒకసారి వంటి భజన పాటలు శ్రోతలను మైమరిపించాయి. హం సా అవార్డు గ్రహీత సిల్విస్టర్ చేసిన వివి ధ రాజకీయ నేతల అనుకరణ, పక్షులు, జంతువుల శబ్దాలు ప్రేక్షక ప్రశంసలు అందుకున్నాయి.

తదుపరి చిన్నారులను ఆడిస్తూ, పాడిస్తూ బొమ్మతో కథలు, కబుర్లు చెప్పి కడుపుబ్బా నవ్వులు పూయించి కేరింతలు కొట్టించారు. కళాప్రదర్శనలు ఆబాలగోపాలాన్ని ఆద్యంతం అలరించాయి. ఈ సందర్భంగా కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కమిషనర్ రమ్యకీర్తన మాట్లాడుతూ పవిత్ర సంగమం వద్ద విజయదశమి వరకు అనేక రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, ముగ్గుల పోటీలు, బతుకమ్మ ఆట, 300 మందితో మహాబృంద నృత్యప్రదర్శన, కోలాటాలు, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇవన్నీ సమాజంలో సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేస్తూ భావితరాలకు వారసత్వ సంపదనను అందించడమే లక్ష్యమన్నారు. అనంతరం కళాకారులను సత్కరించి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందించారు. మూడోరోజు అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కొండపల్లి, గొల్లపూడికి చెందిన స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నేడు 300 మందితో మహాబృంద నృత్యం

దసరాను పురస్కరించుకుని పవిత్రసంగమం, విజయ నర్త నం వేదికపై గురువారం 300 మందితో మహాబృంద నృత్యం నిర్వహించనున్నారు. మహిషాసుర మర్దిని వైభవాన్ని తెలిపే అయిగిరినందిని కీర్తనకు 300 మంది ఒకేసారి కూచిపూడి బృంద నాట్యం చేయనున్నారు. దీనితో పాటు బ్రహ్మాంజలి అనే మరో శ్లోకానికి కూడా ఈ మహాబృందం నాట్యం చేయనుంది.

పున్నమిలో దుర్గామాత టెంపుల్ భారీ సెట్టింగ్



ఉత్తరాదిశైలిలో నిర్మాణం, మూడు భారీ చాంబర్లతో ఏర్పాటు



- ఉత్తరాదిలో కనిపించే ఆకారంలో కనకదుర్గమ్మ భారీ విగ్రహం ఏర్పాటు
- మిగిలిన రెండు చాంబర్లలో భారీ నంది, జ్యోతిర్లింగాల ఏర్పాటు
- లైటింగ్‌తో జిగేల్‌మంటున్న సెట్టింగ్
- విజయా ఏర్పాటు చేసిన ఎడ్లబండి, చెక్కమగ్గం ప్రత్యేక ఆకర్షణ
- పసందైన వంటకాలతో ఫుడ్‌కోర్టులు, ఆకట్టుకుంటున్న సెల్ఫీ పాయింట్లు
- హస్తకళాఖండాల స్టాల్స్ స్వాగతం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ /ఇబ్రహీంప ట్నం): విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా పున్నమిఘాట్‌లో కనకదుర్గ మండపం సెట్టింగ్ ఆకట్టుకుంటోంది. ఉత్తరాది శైలిలో అమ్మవారి గుడి సెట్టింగ్‌ను వేశారు. సెట్టింగ్ బయట అమ్మవారి తలభాగం ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తోంది. లోపల 3 భారీ చాంబర్లు ఏర్పాటు చేశారు. ఒకేసారి 200 మంది దర్శనం చేసుకునేలా ఏర్పాటు చేశారు. విగ్రహాన్ని కూడా ఉత్తరాది కళాకారులే స్వయంగా తయారు చేశారు. అమ్మవారి ముఖం, చేతులు, కాళ్లు కనిపించే వరకు బంగారుపూతతో చేసినవి ఏర్పాటు చేశారు. మిగిలిన భాగమంతా చెక్కలతో ఉంటుంది. దీంతో అమ్మవారు సరికొత్తగా కనిపిస్తున్నారు. రెండు వైపులా స్వాగతం పలుకుతున్నట్టు పెద్ద పెద్ద ఏనుగు బొమ్మలు ఏర్పాటు చేశారు. వామహస్తం వైపునున్న చాంబర్‌లో భారీ నందిని ఏర్పాటు చేశారు. కుడిహస్తం వైపున జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశారు. మూడు చాంబర్లలోనూ అద్భుతమైన లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. లోపలికి వచ్చిన వారికి అద్భుతమైన అనుభూతి కలుగుతుంది. సెట్టింగ్ బయట సాంస్కృతిక వేదికకు మధ్యన ఓపెన్ ఏరియాలో ఫుడ్‌స్టాల్స్ ఏర్పాటు చేశారు. స్వీట్లు, పూతరేకులు, పానీపూరీ తదితర ఉత్తరాది, దక్షిణాది వంటకాలు ఎన్నో ఉన్నాయి. కాఫీ, ఐస్ క్రీమ్స్, ఫాస్ట్‌ఫుడ్స్, నీల్‌గిర్ టీ, విజయవాడ డెయిరీ ప్రొడక్ట్స్ ఎన్నో ఉన్నాయి. ఫుడ్‌స్టాల్స్ మధ్యన విజయా డెయిరీ నేతృత్వంలో మన సంస్కృతిని చాటేలా అలంకరించిన ఎడ్లబండిని ఏర్పాటు చేశారు. ఇదే ప్రాంగణంలో అనేక సెల్ఫీపాయింట్లు ఏర్పాటు చేశారు. బయటకు వచ్చేమార్గంలో హ్యాండీక్రాఫ్ట్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఉప్పాడ చీరలు, డ్రెస్‌లు, బ్యాంకాక్, పట్టాయా టూర్ ఆపరేటర్ స్టాల్స్, హస్తకళాఖండాలు వంటివి ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన చెక్కమగ్గం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.





ఖాతాదారుల సేవల్లో అగ్రగామి

ది కనకమహాలక్ష్మీ కో-ఆపరేటివ్ బ్యాంకును ప్రారంభించిన ఎంపీ కేశినేని శివనాథ్



ది కనకమహాలక్ష్మీ కో-ఆపరేటివ్ బ్యాంకును ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

సత్యనారాయణపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలందించడంలో కనకమహాలక్ష్మీ కో-ఆపరేటివ్ బ్యాంకు ఎప్పుడూ అగ్రగామిగా నిలుస్తోందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. విశాఖలోని అక్కయ్యపాలెం కేంద్రంగా ఏర్పడిన 'ది కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్' 35వ శాఖను విజయవాడ సత్యనారాయణపురంలో బుధవారం ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో సహకార బ్యాంకులపాత్ర కీలకమని, 26 ఏళ్లుగా కనకమహాలక్ష్మీ కో-ఆపరేటివ్ బ్యాంకు సమర్థవంతమైన సేవలందిస్తోందన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన శాఖ ప్రజలకు ఉత్తమ సేవలందించాలన్నారు. మాజీ మంత్రి, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అందించే బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 35 శాఖలున్నాయన్నారు. రూ.1,064 కోట్ల డిపాజిట్లు, రూ.696 కోట్ల రుణాల మంజూరుతో రూ.1,760 కోట్ల వ్యాపారం సాగిస్తోందన్నారు. రానున్న రోజుల్లో గన్నవరం, విశాఖలోని షీలానగర్, వన్‌టౌన్ శాఖలను ప్రారంభిస్తామన్నారు. బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి కే శ్యామ్‌కిశోర్, ఏజీఎంలు పీ వీరభద్రరావు, జాస్తి మురళి, సత్యనారాయణపురం శాఖ మేనేజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు ఘనస్వాగతం

విమానాశ్రయంలో పుష్పగుచ్ఛాలతో గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, భువనేశ్వరి స్వాగతం







గన్నవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఆర్ సుమతి దంపతులకు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని కనకదుర్గమ్మ దర్శనం, విజయవాడ ఉత్సవ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు బుధవారం ప్రత్యేక వాయుసేన విమానంలో ఇక్కడికి విచ్చేశారు. ఆయనకు రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. తొలుత ఉప రాష్ట్రపతి విమానాశ్రయ రన్‌వేపై గౌరవవందనం స్వీకరించారు. అనంతరం మంత్రులు లోకేశ్, వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్, ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, రాజ్యసభ సభ్యుడు సాన సతీష్, బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాద్ తెన్నేటి, పెనమలూరు, గుడివాడ, పామర్రు, పెడన, కైకలూరు ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్, డాక్టర్ కామినేని శ్రీనివాసరావు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు డీకే బాలాజీ, జీ లక్ష్మీశ, కృష్ణా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం భద్రత బలగాల నడుమ ప్రత్యేక వాహనంలో రోడ్డు మార్గాన విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

ఘనంగా వీడ్కోలు..

భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తిరుపతి వెళ్లారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని కనకదుర్గమ్మ దర్శనం, విజయవాడ ఉత్సవ్ ముగించుకుని తిరిగి గన్నవరం విమానాశ్రయానికి బుధవారం సాయంత్రం 6:50 గంటలకు చేరుకున్న ఉపరాష్ట్రపతి దంపతులు సీపీ రాధాకృష్ణన్ ఆర్ సుమతికి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం ప్రత్యేక విమానంలో తిరుపతి వెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్‌ఎంపీ వైద్యుడు మృతి

- ఇంట శుభకార్యం రోజునే అనంత లోకాలకు
- శోకసంద్రంలో పరిసరప్రాంత గ్రామాలు



కృత్తివెన్ను, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిన్న కుమార్తె శ్రీమంతం వేడుకకు అన్ని ఏర్పాట్లు చేసి, హడావిడిగా ఆసుపత్రిలో రోగికి వైద్యం అందించేందుకు వెళ్లిన ఆర్‌ఎంపీ వైద్యుడు రోడ్డు ప్రమాదంలో తిరిగి రాని అనంతలోకాలకు వెళ్లిపోయాడు. కృత్తివెన్ను గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు తెలగంశెట్టి వెంకట రమణ నాగేశ్వరరావు (58) బుధవారం తన ఇంట చిన్న కుమార్తెకు శ్రీమంతం వేడుకకు ఏర్పాటు చేశాడు. ఉదయాన్నే వచ్చిన రోగికి వైద్యం అందించి వెంటనే వచ్చేస్తానని ఇంటి నుంచి క్లీనిక్ వెళ్లాడు. అక్కడ రోగికి వైద్యం చేసి, మరో రోగికి ఇంటి వద్ద వైద్యం అందించేందుకు గాంధీనగరం గ్రామానికి బైక్‌పై బయల్దేరి తన క్లినిక్ ముందు బైక్‌పై రోడ్డు దాటుతుండగా, ప్రమాదవశాత్తు పాలకొల్లు నుంచి విజయవాడకు వెళ్తున్న కారు రమణను బలంగా ఢీకొట్టింది. దీంతో తలకు బలంగా గాయంకాగా, ఆ కారులోనే స్థానిక మరో ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. అప్పటి వరకు సంతోషంగా ఉన్న కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. కృత్తివెన్ను, శీతనపల్లి పంచాయతీల్లో సుమారు 6 గ్రామాలకు ఇంటింటికి వెళ్లి డబ్బులు ఆశించకుండా వైద్యం అందించే వైద్యుడు రోడ్డుప్రమాదంలో మృతిచెందటంతో వందలాది మంది ప్రజలు కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైన కారు కూడా రమణ దగ్గర బంధువులదే కావటంతో ఈ ప్రమాదంపై మరింత విషాదం నెలకొంది.



వరద నియంత్రణ పనులను అధికారులకు సూచిస్తున్న లక్ష్మీపార్థసారథి

కొండవీటి వాగు వరద నియంత్రణ పనుల పరిశీలన

కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి పైఎత్తు నుంచి వరద నీరు వస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డీ లక్ష్మీ పార్థసారథి అధికారులకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. కొద్ది రోజులుగా వర్షపాతం ఎక్కువగా నమోదవుతుండటంతో ఏడీసీ ఇంజినీరింగ్ అధికారులను అప్రమత్తం చేశారు. ఎన్-6 రోడ్డుపై అమృత విశ్వవిద్యాలయం వద్ద కొండవీటి వాగు నీటి ప్రవాహాన్ని బుధవారం పరిశీలించారు. నీరుకొండ నుంచి వస్తున్న వరద నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని ఏడీసీ చీఫ్ ఇంజినీర్లు ఆర్ గోపాలకృష్ణారెడ్డి, బీ నరసింహామూర్తి, సీహెచ్ ధనుంజయలను ఆదేశించారు. విజయవాడ బైపాస్ దాటుకువెళుతున్న ఈ-10, ఈ-11, ఈ-12 రహదార్ల వద్ద వాగు ఉధృతి ఎక్కువగా ఉన్నందున ఎక్కడా అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. కొండవీటి వాగు నీటి ప్రవాహాన్ని క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో ఏడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కే బసవేశ్వరరావు, ఎంవీఆర్ ఇన్‌ఫ్రా ప్రతినిధులు పాల్గొన్నారు.

జీఎస్టీ రిఫార్మ్స్ సక్రమంగా అమలుచేయాలి

20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్

విజయవాడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆత్మనిర్భర్‌లో భాగంగా తర్వాత తరానికి జీఎస్టీ రిఫార్మ్స్ సక్రమంగా అమలుచేసి ప్రధాని మోదీ సంకల్పం వికసిత్ భారత్ సాధనకు అనుగుణంగా ఈ సంస్కరణలను అమలుచేయాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం జరిగిన వినియోగదారుల కొనుగోలు శక్తి పెరుగుదల, దేశఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీఎస్టీ అధికారులు, వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు, సేవలు న్యాయమైన ధరకు అందేలా పర్యవేక్షించాలన్నారు. కేంద్రప్రభుత్వ సంస్కరణల ద్వారా ప్రజలకు వస్తుసేవలను న్యాయంగా అందించడంతో పాటు వ్యాపారస్థులకు మేలు జరిగేలా చాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్ అసోసియేషన్ ఏర్పడిందన్నారు. కేంద్రప్రభుత్వ ఉద్దేశానికి తూట్లు పొడవకుండా పేద, మధ్య తరగతి ప్రజలకు అందించాల్సిన బాధ్యత జీఎస్టీ అధికారులదేనన్నారు. జీఎస్టీ సంస్కరణలకు అనుకూలంగా అసెంబ్లీలో తీర్మాణం చేయడం సీఎం చంద్రబాబు ముందుచూపునకు నిదర్శనమన్నారు. దేశంలోని 90 శాతం కుటుంబాలకు కొనుగోలు శక్తి పెరగడంతో పొదుపు పెరుగుతుందన్నారు. దసరా, దీపావళి పండగలకు ముందే డబుల్ దమాకా మూడ్‌లో దేశప్రజలు ఉన్నారన్నారు. ఆరోగ్య బీమా, ఆహారం, ప్రాణాలను రక్షించే మందులు, వైద్యపరికరాలపై జీఎస్టీ తగ్గించడం వల్ల ప్రజల ఆరోగ్య ప్రమాణాలు మెరుగవుతాయన్నారు.



నూతన కారును విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ దేవ్

మార్కెట్‌లోకి మారుతి నూతన మోడల్ కారు

- లాంఛనంగా ప్రారంభించిన సీఎం చంద్రబాబు

భారతీనగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరుణ్ మోటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో మారుతీ కంపెనీ తయారు చేసిన నూతన ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన మారుతీ విక్టోరిస్ కారును బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు భారతీనగర్‌లోని నోవాటెల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్ మాట్లాడుతూ ఆటోమొబైల్ రంగంలోని మారుతీ కంపెనీ తయారు చేసిన నూతన ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన మారుతీ విక్టోరిస్ కారులో అన్ని ఆధునిక సాంకేతిక ఫీచర్లు ఉన్నాయన్నారు. నూతన జీఎస్టీ కారణంగా తగ్గిన కార్లధరలపై కొత్త ఆఫర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ దేవ్,మారుతీ సుజికి మేనేజింగ్ డైరెక్టర్ హిసాషి టకూచి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ట్సుయెషి టకేశితా, వరుణ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ సీ రాజు, సీఈవో గిరి, వరుణ్ గ్రూప్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలి



అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా నున్నలో విజయవాడ వర్కింగ్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి కేటాయించిన ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం అసెంబ్లీ జీరో అవర్‌లో ఈ అంశాన్ని ఆయన లేవనెత్తారు. 2008 నుంచి ఈ సమస్య అపరిష్కృతంగా ఉందని, 3.5 ఎకరాల కేటాయించగా చివరికి 2.3 ఎకరాలే మిగిలిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించి జర్నలిస్టులకు న్యాయం చేయాలన్నారు. గత శాసనసభ సమావేశాల్లో ఈ విషయాన్ని ప్రస్తావించినప్పుడు గృహనిర్మాణ శాఖ మంత్రి ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారని, మంత్రి ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించాలని యార్లగడ్డ కోరారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పేదలకు ఇచ్చే స్థలాలతో పాటు ఒక సెంటు అదనంగా రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు కేటాయించాలని కోరారు.

14.850 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్ట్



గంజాయితో పట్టుబడ్డ వారితో ఎక్సైజ్ సీఐ శేషగిరిరావు, సిబ్బంది

ఉయ్యూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరులో రెండస్తుల భవనంలో దాచి ఉంచిన 14 కిలోల 850 గ్రాముల గంజాయిని బుధవారం స్వాధీనం చేసుకుని ఇ ద్దరిని అరెస్ట్ చేసినట్టు ఉయ్యూరు సర్కిల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శేషగిరిరావు తెలిపారు. కానూరులో ఓ భవనంపైన పెంట్‌హౌస్‌లో గంజాయి దాచి ఉంచినట్టు తెలిసిన సమాచారం మేర సిబ్బందితో దాడిచేసి పానెం రామమోహన్‌రావు, యలమంచిలి మురళీకృష్ణ ప్రసాద్‌ను అరెస్టుచేసి వారి నుంచి గంజాయి స్వాధీనవ చేసుకుని కేసు నమోదుచేసి ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జికోర్టులో మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచినట్టు తెలిపారు. నంది కేశ్వరరావు, వేణుగోపాలరావు, కే శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.



ఓజీలో పవన్ వినియోగించిన కారును ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

ఘనంగా ఓజీ పవర్ ప్యాక్డ్ కర్టెన్ రైజ్

బెంజ్‌సర్కిల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఈపీఎల్ ఐకాన్ మల్టీప్లెక్స్ పటమట ఆధ్వర్యంలో ఓజీ పవర్ ప్యాక్డ్ కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను యాజమాన్యం బుధవారం ఘనంగా నిర్వహించింది. పవన్ కల్యాణ్ చిత్రాల్లోని పలు గీతాలకు యువత ఉత్సాహభరితంగా ఫ్లాష్ మ్యాబ్ ప్రదర్శించారు. ఫ్లాష్‌మ్యాబ్‌లో ప్రదర్శించిన నృత్యాలను యువతను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ఓజీ చిత్రంలో బొంబాయి బ్యాక్‌డ్రాప్‌లో 1990లో హీరో వినియోగించిన కారును ప్రదర్శించారు. చిత్ర పోస్టర్‌ను మాల్‌పై ఆవిష్కరించారు. లక్కీడిప్‌లో ఆరుగురికి ఉచితంగా ఓజీ ప్రీమియర్ షో టిక్కెట్స్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎల్‌ఈపీఎల్ సీఈవో లింగమనేని కృష్ణకుమార్ మాట్లాడుతూ ఓజీ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను విజయవాడ నగర ప్రజలకు అందించేందుకు ఈ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఓజీ చిత్రం కోసం ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారన్నారని, ఈరోజు రాత్రి నుంచి ప్రీమియర్ షోలు నిర్వహిస్తున్నామని, టికెట్స్ ఇప్పటికే పూర్తిగా సేల్ ఐపోయాయన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరిస్తారని భావిస్తున్నామని వెల్లడించారు.



చుండూరు - పెదవడ్లపూడి మధ్య కొత్త 3వ లైన్‌ను తనిఖీ చేస్తున్న సౌత్ సెంట్రల్ సర్కిల్ రైల్వే సేఫ్టీ (సీఆర్ఎస్) కమిషనర్ మాధవి

చుండూరు - పెదవడ్లపూడి మధ్య కొత్త 3వ లైన్‌లో తనిఖీలు

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పౌర విమానయాన మంత్రిత్వ శాఖలోని సౌత్ సెంట్రల్ సర్కిల్ రైల్వే సేఫ్టీ (సీఆర్ఎస్) కమిషనర్ మాధవి బుధవారం దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లోని చుండూరు - పెదవడ్లపూడి మధ్య కొత్త 3వ లైన్‌ను విస్తృతంగా తనిఖీ చేశారు. లైన్‌ను అమలులోకి తీసుకురావడానికి సంసిద్ధతను అంచనా వేయడం, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడటం వంటివి లక్ష్యంగా తనిఖీలు జరిగాయి. విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా, బ్రాంచ్ ఆఫీసర్లు తనిఖీ సమయంలో ఆమెతో ఉన్నారు. లైన్ ప్రారంభించిన తరువాత, ఈ లైన్ విజయవాడ డివిజన్ అంతటా మెరుగైన కనెక్టివిటీ క్రమబద్ధీకరించబడిన రైలు కార్యకలాపాలకు దోహం చేయనుంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

ఉపరాష్ట్రపతికి ఎమ్మెల్యేల ఘన స్వాగతం

గుడివాడ, పామర్రు, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికై తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా విజయవాడ దసరా ఉత్సవ్‌ను పురస్కరించుకుని ఇంద్రాకీలాద్రికి విచ్చేస్తున్న సీపీ రాధాకృష్ణన్‌ను గన్నవరం విమానాశ్రయంలో సీఎం చంద్రబాబుతో కలసి పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌లు పూలబోకే అందించి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో తదితరులు స్థానిక నేతలు పాల్గొన్నారు.


సీపీ రాధాకృష్ణన్‌కి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యేలు


రామానుజానికి జ్ఞాపికను బహుకరిస్తున్న అధ్యాపకులు

భాషా ప్రావీణ్యం తప్పనిసరి

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యానంతరం బయటికి వెళ్లి ఉద్యోగ సాధన, దానిలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే అంతర్జాతీయ ప్రమాణాలకు తగిన భాషా ప్రావీణ్యం ఎంతో ముఖ్యమని ఎస్ఆర్‌జీఈసి ఈఎల్‌టీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రామానుజన్ పార్థసారథి అన్నారు. స్థానిక వీవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఫార్మసీ కళాశాలలో నాల్గవ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ఫర్ కెరీర్ డెవలప్‌మెంట్ అనే అంశంపై విద్యార్థులకు పలు మెళకువలు తెలిపారు. శిక్షణా కార్యక్రమం అనంతరం ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, అధ్యాకులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న రామలింగేశ్వరరావు

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

కూచిపూడి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ కార్యక్రమం మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు పేర్కొన్నారు. నిడుమోలు పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని రామలింగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా 104 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. సత్యనారాయణ, సామ్రాజ్య లక్ష్మీ, జొన్నలగడ్డ రవి, రాజేంద్ర ప్రసాద్, పాల్గొన్నారు.


గుడివాడలో..


గుడివాడ రూరల్‌లో..


కూచిపూడిలో..


పామర్రులో..


పెదపారుపూడిలో..

అన్నపూర్ణాదేవి నమోస్తుతే..


తోట్లవల్లూరులో..

దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన బుధవారం పలు దేవాలయాల్లోని అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

గుడివాడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ఈవో కె.వి గోపాలరావు, భక్తులు పాల్గొన్నారు.

గౌరీశంకరస్వామి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో కె.వి గోపాలరావు, ధర్మకర్తల కమిటీ చైర్మన్ నెరుసు బోసు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి దేవస్థానంలో అమ్మవారు రాజ్యలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మకర్తల కమిటీ చైర్మన్ అంగడాల సతీష్, పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు రాజ్యలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక నీలామహల్ రోడ్డులో వేంచేసియున్న విజయ దుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గంగు శిరీషా, ధర్మకర్తల కమిటీ చైర్మన్ హరిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక బేతవోలులోని ఆనందేశ్వరస్వామి దేవస్థానంలో భక్త మార్కండేయస్వామి అలంకారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గంగు శిరీషా, ధర్మకర్తల కమిటీ చైర్మన్ బుడమా రాజు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: గుడివాడ రూరల్ మండలంలో అష్టలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ఆలయ చైర్మన్ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆలయ ట్రస్టీ సభ్యులు 400 మంది కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చన, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. పిన్నమనేని నగర్‌లో వేంచేసి ఉన్న అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. చౌటుపల్లి, బొమ్ములూరు తదితర గ్రామాల్లో అమ్మవార్లకు పూజలు చేశారు.


కొండాలమ్మ ఆలయంలో..

గుడ్లవల్లేరు :వేమవరం కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో బుధవారం అమ్మవారు కాశీ అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి సహస్రనామార్చన, సమస్త వ్యవసాయాభివృద్ధికి, వ్యాపారాభివృద్ధికి సుదర్శన, మూలమంత్ర హవనం నిర్వహించారు. సాయంత్రం సాయంకాలార్చన, అమ్మవారికి ఊంజల సేవ, పంచహారతులు నిర్వహించారు. ఆలయ ఈవో కొండలరావు, చైర్మన్ వెంకట విష్ణుమోహనరావు పాల్గొన్నారు.

కూచిపూడి: శరన్నవరాత్రి మహోత్సవ వేడుకల్లో భాగంగా పలు గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. చిన ముత్తేవి అన్నపూర్ణా సమేత సోమేశ్వరస్వామి, కూచిపూడి బాలాత్రిపుర సుందరిదేవి, మొవ్వ భీమేశ్వరస్వామి ఆలయాలతోపాటు నిడుమోలు, ఆవిరిపూడి, అయ్యంకి, పెదపూడి, గూడపాడు, మొవ్వపాలెం, కాజ, కోసూరు తదితర గ్రామాల్లో అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చన, హోమాధి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పామర్రు: స్థానిక గంగాపార్వతి సమేత సోమేశ్వర స్వామి (శివాలయం) దేవాలయంలో బుధవారం గాయత్రీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అంకమ్మ తల్లి దేవస్థానంలో అన్నపూర్ణదేవిగా, వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో మంగళగౌరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెదమద్దాలి, కురుమద్దాలి దేవాలయాల్లో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు.

పెదపారుపూడి: పెదపారుపూడిలోని బీసీ వాడలో మూడవ రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు శ్రీమద్‌భ్రమరాంబ చెన్నమల్లిఖార్జునస్వామి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా రెండవరోజైన బుధవారం కనకదుర్గమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని తరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అధికారుల నిర్లక్ష్య ధోరణితో తప్పని తిప్పలు

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషిచేస్తుంటే కొందరు చిత్తశుద్ధి లేని అధికారుల కారణంగా ఆయన ఆశయానికి తూట్లు పడుతున్నాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆరోపించారు. బుధవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. మచిలీపట్నంలో ఏ.టి.ఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌కు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌పోర్టు అధికారులు దృష్టికి తీసుకువెళ్ళిన కనీసం స్పందన కరువైందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏ.టి.ఎస్ కేంద్రం ఏర్పాటుకు రూ.6కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది : డీకే బాలాజీ

పామర్రు : ఉపాధ్యాయ వృత్తి ఎందో పవిత్రమైనదని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. డీఎస్సీ ద్వారా ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థుల అభినందన సభకు ఆయన ముఖ్యాతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ దిశ దశను నిర్ధారించేది ఉపాధ్యాయులేనన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి వి రామారావు, పూర్ణచంద్రరావు, పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సమష్టి కృషి తప్పనిసరి

● ఎంపీపీ గోగం సురేష్

పెదపారుపూడి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి అందరూ కలసికట్టుగా పని చేయాలని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ గోగం సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో జె.విమాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పొనుగుమాటి రజని, వెలగల పద్మ, సర్పంచ్‌లు ప్రత్తిపాటి అశ్వర్ధన్ రావు, కార్యదర్శులు సాగర్ రాణి, డీసీహెచ్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోగం సురేష్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గద్దె పుష్పరాణి

గుడివాడ రూరల్ : రాష్ట్రంలో పేదరికం లేని మెరుగైన సమాజాన్ని నిర్మించటానికి శిక్షణా తరగతులు ఏర్పాటు చేశామని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. బుధవారం గుడివాడ మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు మండలాల సర్పంచ్‌లకు, ఎంపీపీలకు, జడ్పీటీసీలకు స్థానిక సుస్థిరాభివృద్ధి, లక్ష్యాల 17 అంశాలపై శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజనల్ స్థాయిలో సర్పంచ్‌లు హాజరు కావటం సంతోషమన్నారు.ఎంపీపీలు పెయ్యల ఆదాము, సురేష్, జడ్పీటీసీ రామకృష్ణ, పాల్గొన్నారు.

పోషకాహారంతోనే వ్యాధులు దూరం

● ఎంపీడీవో సీతారామరాజు

పమిడిముక్కల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహారం సద్వినియోగం చేసుకుని ఆరోగ్య వంతులుగా జీవించాలని ఎంపీడీవో సీతారామరాజు అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పమిడిముక్కల పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి పౌష్టికాహార మాసోత్సవం సమావేశంలో ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం అవసరాన్ని వివరించారు. తల్లిపాల విశిష్టతను పీహెచ్‌సీ డాక్టర్ ఇందు తెలియజేశారు. తహసీల్దార్ నవీన్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఉష, సలీమ అబ్దుల్, అనితలు పాల్గొని నలుగురు పిల్లలకు అన్నప్రసన కార్యక్రమం చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీతారామరాజు


అవగాహన కల్పిస్తున్న అరుణ కుమారి

పెదపారుపూడి : మండల పరిధిలోని భూషణగుళ్ల-2 సెంటర్‌లో పోషకాహార మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. అ సందర్భంగా అంగన్వాడీ సూపర్‌వైజర్ అరుణ కుమారి మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రం ద్వారా ఇచ్చే ఆహారం తీసుకోవాలన్నారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి

గుడివాడ: ప్రమాదావశాత్తు రైలు కిందపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన బొమ్ములూరులో చోటు చేసుకుంది. బొమ్ములూరు శివారు గంగాధరపురానికి చెందిన పానాల సాంబశివరావు(46) మంగళవారం రాత్రి రైల్వే ట్రాక్ సమీపంలో బహిర్భూమికి వెళ్లాడు. ఆ సమయంలో ఫిట్స్ రావడంతో ప్రమాదావశాత్తు పట్టాలపై పడిపోయాడు. పరిసరాల్లో ఎవరూ లేకపోవడంతో పట్టాలపై పడి ఉన్న సాంబశివరావుపై నుంచి రైలు వెళ్లడంతో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

పచ్చదనం, పరిశుభ్రత సామాజిక బాధ్యత

●ఏఎన్ఆర్ కళాశాల కార్యదర్శి అప్పారావు

గుడివాడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : పచ్చదనం, పరిశుభ్రత సామాజిక బాధ్యత అని, దానిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ఏఎన్ఆర్ కళాశాల పాలకవర్గ కార్యదర్శి కె.ఎస్ అప్పారావు కోరారు. బుధవారం స్థానిక కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు మొక్కలు నాటారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు ఎల్ఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, పాల్గొన్నారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ అధ్యక్షుడు యలమంచిలి నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఎన్ఎస్ఎస్ పీవో సతీష్‌చంద్ర కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు, ఆలియా బేగం పాల్గొన్నారు.


ఎన్.ఎస్.ఎస్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఇంజనీరింగ్ విద్యార్థులు

గుడ్లవల్లేరు : స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో 56వ జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ , కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.సిద్దయ్య, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండరామారావు, పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ కొని మహిళ మృతి

ఉయ్యూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై తాడంకి సమీపాన బుధవారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని మహిళ మృతిచెందింది. మచిలీపట్నం చికలపూడికి చెందిన వీరంకి నాగమల్లేశ్వరరావు అతని భార్య వీరంకి నాగలక్ష్మి(42) మోటార్ సైకిల్‌పై విజయవాడ వైపు వస్తుండగా తాడంకి సమీపాన ఎదురుగా వస్తున్న టీవీఎస్ మోపెడ్ ఢీ కొంది. ఈప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై వెనుక కూర్చున్న నాగలక్ష్మి కిందపడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. టీవీఎస్‌పై ఉన్న అడపా వీర రాఘవయ్యకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదుచేశారు.

తెగుళ్ల నివారణకు ముందస్తు చర్యలు తప్పనిసరి

గుడివాడ రూరల్: గుడివాడ మండలంలో వరి పైరుకు రైతులు తెగుళ్లు ఆశించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఏవో బోలెం అనంతలక్ష్మీ తెలిపారు. బుధవారం సెరివేల్పూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

పేదరికం లేని సమాజమే పీ4 లక్ష్యం

● ఎంపీడీవో కాండ్రు జ్యోతి

పామర్రు, సెప్టెంబరు24(ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను పేదరిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న పీ-4పథకం ప్రధాన లక్ష్యమని ఎంపీడీవో కాండ్రు జ్యోతి అన్నారు. బుధవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో మండలంలోని అన్నిగ్రామ సచివాలయ,గ్రామపంచాయతీ ఉద్యోగులకు పీ-4పథకం పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు.


సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో జ్యోతి

కూచిపూడి: గ్రామాల్లో పీ 4 అమలుపై సచివాలయ సిబ్బంది నిర్వహించాల్సిన విధి విధానాలపై మొవ్వ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుహాసిని మాట్లాడుతూ బంగారు కుటుంబాల గుర్తింపు, ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలు, లక్ష్యాలు, విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పరామత్య, మాస్టర్ ట్రైనర్లు జశ్వంత్, ఆంజనేయులు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మొవ్వలో మాట్లాడుతున్న ఎంపీడీవో సుహాసిని

నందివాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 సర్వే గ్రామాల్లో ఏ విధంగా నిర్వహించాలో గ్రామ సచివాలయ ఉద్యోగులకు బుధవారం నందివాడ వెలుగు కార్యాలయంలో ఇంచార్జ్ ఎంపీడీవో విజయ దేవరాజు, ఈవోపీఆర్‌డీ అమీర్ మీర్జా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రొఫెషనల్ మణికంఠ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

గుడివాడ : పట్టణంలో ఏడేళ్ల బాలుడిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. స్థానిక 11వ వార్డుకు చెందిన బాలుడు స్నేహితులతో కలిసి సైకిల్ తొక్కుకునేందుకు వెళ్లగా, ఒక్కసారిగా వీధి కుక్కలు వెంటపడ్డాయి. ఈక్రమంలో తప్పించుకునేందుకు వేగంగా సైకిల్ తొక్కగా అదుపు తప్పి బాలుడు కిందపడ్డాడు. అయినా కుక్కలు వదలకుండా బాలుడిపైదాడిచేసి గాయపరిచాయి. బాలుడిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

గుడివాడ రూరల్: గంగాధరపురానికి చెందిన మేకతోటి రవి (39) చిన ఎరుకపాడు ఒక వ్యక్తికి విద్యుత్ పనులు చేయటానికి వెళ్లి విద్యుదాఘాతానికి గురయ్యాడు. బాధితుడిని చికిత్స నిమత్తం గుడివాడలోని ప్రైవేట్ హాస్పటల్‌కి తీసుకువెళ్లారు. మధ్యలో అతడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

నందివాడ: గుడివాడ లయన్స్ క్లబ్ సహాయ సహకారంతో బుధవారం పోలుకొండలో పశువైద్యశాల వద్ద ఉచిత పశువైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

ఎడ్లంక గ్రామాన్ని రక్షించండి



అవనిగడ్డ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది వరదల కారణంగా కోతకు గురవుతున్న ఎడ్లంక గ్రామాన్ని రక్షణ గోడ, వంతెన నిర్మించి రక్షించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బుధవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. కృష్ణానది వరదల కారణంగా చాలా ఇళ్లు నదీ గర్భంలో కలిసిపోయాయని, ఈ ఏడాది మరో నాలుగు ఇళ్లు నదీ గర్భంలో కలిసిపోయాయని, గ్రామాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

జగన్ గ్యాంగ్..
శ్రీవారి సొత్తూ స్వాహా చేశారు

● అవనిగడ్డలో పోస్టర్లు అంటించి టీడీపీ నేతల నిరసన



నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

అవనిగడ్డ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఘనులు, భూములు, అడవులు, సమస్త వనరులతో పాటు జనాన్ని దోచుకున్న జగన్ గ్యాంగ్ చివరికు తిరుమల శ్రీవారి సొత్తునూ స్వాహా చేసిందని ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆరోపించారు. అవనిగడ్డ ప్రధాన సెంటర్‌లో బుధవారం రాత్రి గోడలకు పోస్టర్లు అంటించి టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. జగన్ పాలనలో అవినీతి రాజ్యమేలిందని కొల్లూరి అన్నారు. తాడేపల్లి ప్యాలెస్ ఆశీస్సులతో నాటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అండదండలతో తిరుమల పరకామణిలో దొంగలు పడ్డారని అన్నారు. కోట్ల విలువైన సొత్తు కొల్లగొట్టారని, ఈ డబ్బు రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టారని, తిరుపతిలో భూమన నుంచే తాడేపల్లి ప్యాలెస్‌కు వాటాలు వచ్చాయని తెలిపారు. టీడీపీ నాయకులు బండే రాఘవ, పరుచూరి దుర్గా ప్రసాద్, మండలి రామ్మోహనరావు, ఘంటసాల రాజమోహనరావు, దాసినేని శ్రీనివాసరావు, చందన రంగారావు పాల్గొన్నారు.

నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

● మునిసిపల్ కమిషనర్‌కు సచివాలయ కార్యదర్శుల వినతి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని మునిసిపల్ కమిషనర్ బాపిరాజుకు బుధవారం సచివాలయ కార్యదర్శులు వినతిపత్రమిచ్చారు. సర్వేల నుంచి విముక్తి కల్పించాలని, జాబ్ చార్ట్ ప్రకారం పనులు అప్పగించాలని సంఘ జేఏసీ నాయకుడు కిరణ్ తదితరులు కోరారు.

మర్యాదపూర్వకంగా..



జేసీ నవీన్‌కు మొక్క అందిస్తున్న కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన నవీన్‌ను బుధవారం మునిసిపల్ కమిషనర్ బాపిరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. నగర ప్రత్యేకతపై కమిషనర్ ఈ సందర్భంగా జేసీకి వివరించారు.

సృజనాత్మకత పెంపొందించుకోవాలి

● ఇంజనీరింగ్ విద్యార్థులకు బెల్ డీజీఎం శివరామకృష్ణ సూచన



మాట్లాడుతున్న బెల్ డీజీఎం శివరామకృష్ణ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని, సృజనాత్మకతను పెంపొందించుకోవాలని బెల్ డీజీఎం శివరామకృష్ణ సూచించారు. బుధవారం వైజేఆర్‌డీఎంఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు స్మార్ట్ ఇండియా హాకథాన్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 50 మంది విద్యార్థులు 9 బృందాలుగా తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఐటీ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలని ఎపెక్స్‌న్యూరా ఐటీ సొల్యూషన్స్ సీఈవో కె.ప్రసాద్ సూచించారు. ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్, అధ్యాపకులు డాక్టర్ జె.ఉదయభాస్కర్, డాక్టర్ సదత్ ఆలీ మాట్లాడారు.

విద్యుత్ సబ్సిడీ కోసం
చెరువుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

● ఆక్వా రైతులకు మత్స్యశాఖ ఏడీ ప్రతిభ సూచన

నాగాయలంక, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆక్వా రైతులు విద్యుత్ సబ్సిడీ కోసం తప్పనిసరిగా ఆక్వా చెరువులను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మత్స్యశాఖ అవనిగడ్డ ఏడీ ఆర్.ప్రతిభ సూచించారు. బుధవారం కమ్మనమోలు రెవెన్యూ పరిధిలోని నాలి గ్రామంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆక్వా రైతులకు యూనిట్‌కు రూపాయి 50 పైసలు చొప్పున సబ్సిడీ వస్తుందన్నారు. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ లేదా లైసెన్స్ లేకుండా సాగు చేస్తున్న ఆక్వా రైతులు గ్రామ మత్స్య సహాయకులను సంప్రదించి ధ్రువపత్రాలను అందజేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. లేని పక్షంలో ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ లభించదని తెలిపారు. సునీత, విక్టర్ పాల్, గ్రామ మత్స్య సహాయకులు, కమ్మనమోలు, నాలి గ్రామ ఆక్వా రైతులు హాజరయ్యారు.

మత్స్యకారులకు సబ్సిడీపై డీజిల్ అందించాలి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డీజిల్, వలలను సబ్సిడీపై అందజేయాలని అఖిల భారత పోర్టు వర్కర్ల ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ షేక్ ఫతుల్లా బాషా డిమాండ్ చేశారు. బుధవారం గిలకలదిండి పోర్టును ఆయన సందర్శించారు. కార్మికుల కష్టసుఖాలపై చర్చించారు. డీజిల్‌పై సబ్సిడీ అందకపోవడం వల్ల ఆశించినంతగా ప్రయోజనం చేకూరడం లేదన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రత్యేక పథకాలను అమలు చేయాలన్నారు.

ఎండీవో కార్యాలయంలో సర్పంచ్‌లకు శిక్షణ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బందరు ఎండీవో కార్యాలయంలో ఎండీవో వెంకటేష్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. సుస్థిర అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్ల నిర్మాణం, చెత్త నుంచి సంపద కేంద్రాలపై, పారిశుధ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఆర్థిక పరిపుష్టి కలిగేందుకు పన్నులు వసూలు చేయాలన్నారు. పీ-4 కార్యక్రమం కింద దాతల సహకారంతో భవనాలు నిర్మించాలన్నారు.

గ్రామాల సుస్థిరాభివృద్ధే లక్ష్యం

పెడన రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించి, వాటిని అమలు చేయాలని సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఎంపీపీ రాజులపాటి వాణి, ఎండీవో అరుణకుమారి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల సర్పంచులు, కార్యదర్శులకు రెండు రోజుల వర్క్ షాప్ నిర్వహించారు. శిక్షకులు పర్వతుల్లా, వాసు, ప్రదీప్, డిప్యూటీ ఎండీవో నాగిరెడ్డి, సర్పంచ్‌లు గుడిశేవ శ్రీనివాసరావు, బొడ్డు చినబాబు పాల్గొన్నారు.

బాలుడి మృతదేహం లభ్యం

గూడూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కాలువలో స్నానానికి వెళ్లి గల్లంతయిన బాలుడు వెలిపూడి జీవన్‌కుమార్(12) మృతదేహం బుధవారం రామరాజుపాలెం కాలువ వంతెన వద్ద లభ్యమయింది. జొన్నలరేవు వద్ద మంగళవారం గల్లంతయిన జీవన్‌కుమార్ మృతదేహం కొట్టుకుంటూ వచ్చి రామరాజుపాలెం వంతెన వద్దకు వచ్చింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు ప్రాణాలతో తిరిగి వస్తాడన్న ఆశతో ఉన్న తల్లిదండ్రులు విజయ్, సావిత్రి ఆశలు అడియాశలుగానే మిగిలాయి. జీవన్‌కుమార్ మృతదేహానికి ఏఎస్ఐ శామ్యూల్ శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బందరు సర్వజనాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.



అన్నపూర్ణగా మచిలీపట్నం, చల్లపల్లి, నాగాయలంకలో కన్యకా పరమేశ్వరి అమ్మవార్లు

పెడన పైడమ్మ

కోడూరు గంగానమ్మ

ఘంటసాల సత్రం సెంటర్‌లో..

అన్నపూర్ణగా జగన్మాత



పెడన కన్యకా పరమేశ్వరి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పండితులు



పెదకళ్లేపల్లిలో..

మచిలీపట్నం టౌన్/అవనిగడ్డ రూరల్/నాగాయలంక/మోపిదేవి/కోడూరు/చల్లపల్లి/ఘంటసాల/పెడన, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో మూడో రోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మచిలీపట్నం రాబర్టుసన్‌పేట రామలింగేశ్వరస్వామి, కొజ్జిల్లిపేట నాగేశ్వరస్వామి, బచ్చుపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, సర్కిల్‌పేట మల్లేశ్వరస్వామి, ఈడేపల్లి శక్తిగుడి, కోనేరుసెంటర్‌లోని కన్యకా పరమేశ్వరీ దేవాలయం, బుట్టాయిపేట దత్తాశ్రమం, బాస్కరపురం త్రిశక్తిపీఠంలలో అమ్మవారికి ఉదయం నుంచి కుంకుమ పూజలు, లలిత సహస్ర నామ పారాయణలు చేశారు. పులిగడ్డలో కనకదుర్గమ్మ, వేకనూరులో అంకాలమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అశ్వారావుపాలెంలోని కోదండ రామాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. నాగాయలంక మండలం గణపేశ్వరంలో దుర్గా గణపేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నాగాయలంకలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు గాయత్రీదేవి, పార్వతి, అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి ఆలయం, కొక్కిలిగడ్డ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, మోపిదేవి సకలేశ్వరస్వామి ఆలయం, వెంకటాపురం, పెదప్రోలు గ్రామాల్లో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా విశేష పూజలందుకున్నారు. కోడూరు మండలం విశ్వనాథపల్లి, మందపాకల, నరసింహాపురం, కోడూరు ఆలయాల్లో అన్నపూర్ణాదేవిగా అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. చల్లపల్లిలో అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, కన్యకా పరమేశ్వరి ఆలయం, నడకుదురు పృథ్వీశ్వర క్షేత్రంలో శ్రీబాలాత్రిపురసుందరీదేవి, లక్ష్మీపురంలోని దుర్గాపార్వతీసమేత సోమేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరి సహిత లక్ష్మీనాంచారమ్మ, రామానగరం క్లబ్‌రోడ్‌లోని ఉత్సవపందిరిలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఘంటసాల సత్రం సెంటర్‌లోని రామాలయం వద్ద అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెడనలో పైడమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరీ దేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి హోమాలు, కుంకుమార్చనలు, లలిత పారాయణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

గాయత్రీ దేవి అలంకరణలో..

కృత్తివెన్ను/బంటుమిల్లి/గూడూరు: కృత్తివెన్నులోని దుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అడ్డపర్ర కనకదుర్గ ఆలయంలో అమ్మవారు మాతా అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గూడూరులో మహాలక్ష్మి, రామలింగేశ్వర స్వామి దేవస్థానాల్లోని అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బంటుమిల్లి మండలం పెదతుమ్మిడిలో పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా, పాశ్చాపురంలో అన్నపూర్ణాదేవిగా, అర్తమూరు కాశీఅన్నపూర్ణేశ్వరి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

పెరుగుతున్న వరద



చల్లపల్లి మండలం రాముడుపాలెం పుష్కరఘాట్ వద్ద, నాగాయలంకలో లంగర్లు వేసి నిలిపిన పడవలు

చల్లపల్లి/నాగాయలంక, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బ్యారేజీ వద్ద బుధవారం మధ్యాహ్నానికి నాలుగున్నర లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో నదిలో వరదప్రవాహం పెరుగుతోంది. రాముడుపాలెం పుష్కరఘాట్ వద్ద మెట్లు నీటమునిగాయి. నడకుదురు, నిమ్మగడ్డ గ్రామాల్లో పల్లపుప్రాంతాల్లోకి వరదనీరు వస్తోంది. నదిపక్కనే ఉన్న చేలకు సమాంతరంగా నీరు ప్రవహిస్తోంది. మరో రెండడుగుల మేర పెరిగితే పొలాల్లోకి నీరు వస్తుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే నదిపక్కనే ఉన్న ఇటుక బట్టీలు నీటి ముంపునకు గురయ్యాయి. నాగాయలంక శ్రీరామపాదక్షేత్రంలోని పుష్కరఘాట్‌కు భారీగా వరద చేరింది. ఘాట్‌లో ఉన్న కృష్ణవేణమ్మ విగ్రహం రామలింగేశ్వరస్వామి ఆలయం చెంతకు వరద నీరు వచ్చి చేరింది. మత్స్యకారులు తమ పడవలను ఒడ్డుకు చేర్చి లంగర్లు వేశారు.

ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించాలి

మోపిదేవి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిబంధనలు సడలించాలంటూ అధికారులకు రైతులు విజ్ఞప్తి చేశారు. బుధవారం రావివారిపాలెం గ్రామంలో తహసీల్దార్ ఎం.హరనాథ్, ఏవో హెబ్సిబా రాణిలు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ధాన్యం తేమ శాతం 17 శాతం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ప్రకృతి వైపరీత్యాలు, రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తేమశాతం నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేసేలా ముందస్తు ప్రణాళికలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రైతులు కోరారు. రాయితీపై టార్పాలిన్లు అందజేయాలని కోరారు. ప్రస్తుతం వరిలో పండు తెగులు, ఎలుకల బెడద అధికంగా ఉందని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ పరుచూరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు కొమ్ము పవన్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కృష్ణకుమారి



ప్రమాణస్వీకారం చేస్తున్న చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి

చల్లపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చల్లపల్లి సర్పంచ్, తెలుగుమహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. జలవనరులశాఖ ఆధ్వర్యంలో విజయవాడ రైతు శిక్షణ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టరుగా నియమితులైన కృష్ణకుమారిని పలువురు సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), కార్పొరేషన్ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, ఎండీ ఎస్.తిరుమలరావు, జలవనరులశాఖ ఉన్నతాధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

పెడన, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బంటుమిల్లి మండలం పెందుర్రు గ్రామ ప్రజలు తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శొంఠి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెందుర్రు గ్రామ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి ఇటు పాలకులు, అటు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. సమస్యకు పది రోజుల్లోగా పరిష్కారం చూపకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెందుర్రులో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

అద్దంకి నాంచారమ్మ
హుండీ ఆదాయం రూ.7,07,150

కోడూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విశ్వనాథపల్లి గ్రామంలోని అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం ఆరు నెలలకు రూ.7,07,150 వచ్చినట్లు ఆలయ ఈవో యు.జయశ్రీ తెలిపారు. బుధవారం మచిలీపట్నం దేవాదాయశాఖ అధికారి ఎన్.అరుణ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో హుండీ లెక్కించామన్నారు. గ్రామ పెద్దలు తోట రాంబాబు, తోట లక్ష్మణరావు, ఆలయ అర్చకుడు పార్థసారథి పాల్గొన్నారు.

జీఎస్టీపై వర్తకులకు అవగాహన

బంటుమిల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సవరించిన జీఎస్టీపై తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో బంటుమిల్లిలో వర్తకులకు బుధవారం అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. కిరాణా, క్లాత్ మర్చంట్ వర్తకుల సమావేశంలో తూనికలు, కొలతల అసిస్టెంట్ కంట్రోలర్ భానుప్రసాద్ మాట్లాడారు. మండలంలోని కిరణా వర్తకులు, క్లాత్ మర్చంట్ సభ్యులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల బలోపేతానికి కృషి చేయండి

మోపిదేవి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): త్రిసభ్య కమిటీలకు సహకరించి, రుణాలు సకాలంలో చెల్లించి పీఏసీఎస్‌ల బలోపేతయ్యేలా కృషి చేయాలని రైతులకు తహసీల్దార్ హరనాథ్ సూచించారు. బుధవారం రావివారిపాలెంలో నిర్వహించిన పీఏసీఎస్ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం పరిధిలో రుణాలకు దరఖాస్తుచేసుకున్న వారికి 15 రోజుల్లో రుణాలు అందిస్తామని చైర్మన్ పరుచూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మెగా డీఎస్సీలో జిల్లా స్థాయిలో 20వ ర్యాంకు సాధించిన పోలిమెట్ల స్వయంప్రభను పీఏసీఎస్ ఆధ్వర్యంలో అధికారులు, రైతులు సత్కరించారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, ఎంపీటీసీ సభ్యుడు కొమ్ము పవన్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కంఠమనేని కుటుంబరావు, తెలుగు మహిళ నియోజకవర్గ కార్యదర్శి మోర్ల జయలక్ష్మి, సొసైటీ సీఈవో మోపిదేవి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దానగూడెం బాధితుల తరపున
ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టుకు శ్రావణ్‌కుమార్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలం దానగూడెం బాధితులకు అండగా మచిలీపట్నం ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టులో వాదనలు వినిపించేందుకు న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ బుధవారం హాజరయ్యారు. ఆయన వాదనలు వినిపించగా, జడ్జి వాయిదా వేయడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. అనంతరం లక్ష్మీటాకీసు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

మండల కార్యాలయంలో వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ తుంగల సుమతీదేవి

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తైన సందర్భంగా ఎంపీపీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఇప్పటి వరకు ఎంపీపీలుగా పని చేసిన సింహాద్రి నాంచారయ్య, పాముర్తి చిన్న పిచ్చియ్య, వనజ కృష్ణ, సింగం రాజేశ్వరి, దిడ్ల ప్రసాద్, బండే కనకదుర్గ ఫొటోలను ఏర్పాటు చేయగా వాటిని ఎంపీపీ తుంగల సుమతిదేవి ఆవిష్కరించారు. భారీ కేక్‌ను ఆమె కట్ చేశారు. జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎండీవో మరియకుమారి, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తుంగల సుమతిదేవి అధ్యక్షతన నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మోపిదేవి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగపర్చుకోవాలని ఎంపీపీ రావి దుర్గావాణి సూచించారు. బుధవారం పెదప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ సాయి మహిళలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సరైన ఆహారం తీసుకోవాలని సూచించారు. వయో వృద్ధుల ఆరోగ్య పరీక్షలు, క్షయవ్యాధి పరీక్షలు, క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు, పీఏసీఎస్ చైర్మన్ నాదెళ్ల శరత్ చంద్రబాబు, ఎంపీడీవో స్వర్ణభారతి, ఎంఈవో ఏవీ రమణ, వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహార కిట్లు అందజేత

నాగాయలంక, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం చైల్డ్ రక్షా ప్రాజెక్టు ఆధ్వర్యంలో దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న పిల్లలు, అనాథ పిల్లలు 35 మందికి రూ.21 వేలు విలువైన పోషకాహార కిట్లను అందజేశారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, భోగాది శివవిష్ణు వర్ధన్, కైతేపల్లి అంకాలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

సీజనల్ హాస్టల్ ప్రారంభం

పెడన, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జోగానందరావు కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టల్‌ను ఆ వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఎంతో ఉపయుక్తమైన సీజనల్ హాస్టల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హాస్టల్ కో-ఆర్డినేటర్ బొడ్డు రవి, హెచ్ఎం బి. నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

నగర సమస్యలు ఫోన్ చేసి తెలపండి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలో సమస్యలను 98499 07989కు ఫోన్ చేసి తెలపాలని కమిషనర్ బాపిరాజు సూచించారు. 365 రోజులు ఇంటి పన్ను కట్టించుకుంటున్నామన్నారు.

పాత ఎడ్లంక పరిరక్షణకు చర్యలు

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దీవి గ్రామం పాత ఎడ్లంక పరిరక్షణకు కూటమి ప్రభుత్వం తగు చర్యలు చేపడుతోందని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం పాత ఎడ్లంక దీవి గ్రామ కోత సమస్యను వరద నీటి మర పడవలో వెళ్లి పరిశీలించారు. టీడీపీ నాయకులు బండే రాఘవ, ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య), వడుగు రవి పాల్గొన్నారు.